జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | సోమవారం 21 సెప్టెంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :248 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com




WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967


## తేజస్‌లో ప్రయాణించిన భారత్..
# జపాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు



- ఆకట్టుకున్న ఇరుదేశాల సైనిక విన్యాసాలు
- జోధ్‌పూర్‌లో భారత్- జపాన్ సైనిక విన్యాసాలు
- ఈ విన్యాసాలలో భారత్ తరఫున పాల్గొన్న తేజస్, సుకోయ్-30ఎంకేఐ, రఫేల్.. జపాన్ నుంచి పాల్గొన్న ఎఫ్-2ఏ ఫైటర్ జెట్

2

# విద్యాశాఖలో రాజకీయాలకు చోటులేదు




- 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' అమలు: మంత్రి లోకేశ్
- విలువల విద్యపై విద్యార్థులకు దిశానిర్దేశం
- సాంకేతికతకు భారతీయ విలువలు తోడైతే, ప్రపంచ విజేతలుగా ఎదగొచ్చు
- పిల్లల్లో చిన్నప్పటి నుంచే పెద్దలను, మహిళలను గౌరవించడం గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించడం నేర్పించాలి
- ఈ ఏడాది లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు
- ఇంటర్‌లోనూ పది వేల అడ్మిషన్లు పెరిగాయి
- యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూస్‌లో రాజకీయ పార్టీ రంగులు లేకుండా చర్యలు తీసుకున్నాం



## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్

- విద్యార్థులకు అండగా రాహుల్: కాంగ్రెస్
- విద్యార్థులను అణచివేస్తున్న వ్యవస్థ వెనుక ఉన్నది బీజేపీ ఆర్ఎస్ఎస్ వాళ్లేనని కాంగ్రెస్ ఆరోపణ
- విద్యా వ్యవస్థను గుల్లగా మార్చి, అవినీతిమయం చేశారని విమర్శ

2



## ఓటర్ల తొలగింపు వెనుక అమిత్ షా ఉన్నారు

ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

## అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ
# రెండూ ముఖ్యమే



- గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు పయనం
- ఇప్పుడు మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం దేవుడు నాకు ఇచ్చాడు: బెంగళూరులో చంద్రబాబు
- బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు
- గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు వెళ్లాలని పిలుపు
- పర్యావరణ హిత నగరంగా అమరావతి నిర్మాణం చేపడతామని వెల్లడి

**బెంగళూరు**

బెంగళూరులోని వైట్ ఫీల్డ్ లో ఆదివారం జరిగిన 'ది ఎర్త్ సెంటర్ - విష్టా స్పేసెస్' ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి చంద్రబాబు ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా సైబరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశాను. ఇప్పుడు అమరావతి రూపంలో మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం నాకు దేవుడు ఇచ్చాడు" అని అన్నారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలిక వసతులతో అమరావతిని భవిష్యత్ తరాలకు అనువైన, పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచం ఇప్పుడు 'గ్రే గ్రోత్' నుంచి 'గ్రీన్ గ్రోత్' వైపు దృష్టి సారించాల్సిన తరుణం ఆసన్నమైందని చంద్రబాబు పిలుపునిచ్చారు. - మిగతా3లో

## యూపీలోని వీధుల్లో నడిచే మహిళను వేధించే సాహసం ఎవరూ చేయరు



- వీధిలో నడిచే ఆడపిల్లను వేధించే సాహసం ఎవరైనా చేస్తారా? అలా చేస్తే మరణ శాసనం రాసుకున్నట్లే
- యూపీలో మహిళల భద్రతపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు
- తన హయాంలో మతపరమైన అశాంతి పూర్తిగా తొలగిపోయింది

2

# రూ.3,200 కోట్ల ముడుపులు ఎవరివి?



- సత్యప్రసాద్ వాంగ్మూలంపై జగన్ ఎందుకు స్పందించడంలేదు?
- గత వైసీపీ ప్రభుత్వ మద్యం విధానంపై మంత్రి పార్థసారథి తీవ్ర ఆరోపణలు
- రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంపై జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్
- కీలక అధికారి సత్యప్రసాద్ వాంగ్మూలంతో కుంభకోణం గుట్టు రట్టయిందని వెల్లడి
- డిజిటల్ చెల్లింపులు రద్దు చేసి నగదు లావాదేవీలతో భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణ
- కూటమి ప్రభుత్వంలో పారదర్శక మద్యం విధానం అమలు చేస్తున్నామని స్పష్టీకరణ

3




## మనవాళ్లు చైనాకు పట్టుబడ్డప్పుడు
# నా పనైపోయిందనుకున్నా

- యువ ఐపీఎస్ అధికారిగా ఉన్నప్పటి ఘటనను గుర్తుచేసుకున్న దోవల్
- ఆయన పంపిన నిఘా బృందాన్ని చైనా సైన్యం అదుపులోకి తీసుకుంది
- ఈ ఘటనతో తన కెరీర్ ముగిసిపోయిందని భావించినట్లు వెల్లడి
- హెడ్ క్వార్టర్స్ ఇచ్చిన తప్పుడు మ్యాపుల వల్లే సమస్య తలెత్తిందని విచారణలో తేలింది
- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో పాత జ్ఞాపకాలను పంచుకున్న దోవల్

# యాక్షన్ ప్లాన్ తయారు చేయండి

- సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఎల్ నినో ప్రభావాన్ని ముందే అంచనా వేసుకున్నాం..
- ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి
- ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రైతులను ఆదుకోవడం, నిత్యావసరాల ధరల నియంత్రణే ప్రధాన లక్ష్యం
- బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలు అదుపులో ఉంచాలని ఆదేశం
- డిమాండ్‌కు తగిన పంటల సాగు, వర్షాధార వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచన
- విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం



**అమరావతి**

ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను అదుపులో పెట్టాలంటూ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్సు లో అధికారులతో మాట్లాడు తూ హైరిస్క్ ఆర్ఎస్కే పరిధిలోని హార్టికల్చర్ పంటలను ఆదుకునేందుకు ఇచ్చే నిధులను సద్వినియో గం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచన. డిమాండ్ ఆధారిత పంటల సాగుపై ఫోకస్ పెట్టాలన్న సీఎం చంద్రబాబు. ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకునేలా తాత్కాలిక, మధ్యంతర ప్రణాళికలతో వెళ్లాలని ముఖ్యమంత్రి సూచన. ఎల్ నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకున్నాం. ముందుగానే సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ - మిగతా3లో

# తేజస్‌లో ప్రయాణించిన భారత్, జపాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు



భారత్– జపాన్ ద్వైపాక్షిక వాయుసేన సంయుక్త విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. 'వీర్ గార్డియన్–2026'లో భాగంగా జోధ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ సంయుక్త విన్యాసాలు నిర్వహించారు. ఈ క్రమంలో భారత్‌కు చెందిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్‌లో జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ అధిపతి జనరల్ టకెహిరో మొరిటా, భారత వైమానిక దళం చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కలిసి ప్రయాణించారు. ఈ ప్రయాణం అనంతరం భారత్, జపాన్‌ల వైమానిక దళ చీఫ్‌లు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను ప్రస్తావించారు. కాగా, ఈ విన్యాసాల్లో ఐఏఎఫ్ తరఫున స్వదేశీ తేలికపాటి యుద్ధ విమానం తేజస్, సుకోయ్–30ఎంకేఐ, రఫేల్ వంటి అత్యాధునిక యుద్ధ విమానాలు పాల్గొనగా, జేఏఎస్‌డీఎఫ్ నుంచి ఎఫ్–2ఏ ఫైటర్ జెట్ పాల్గొంది.

**భారత్– జపాన్ రక్షణ సంబంధాలను ఐఏఎఫ్ చీఫ్ హర్షం**

తొలిసారిగా జపాన్ యుద్ధ విమానాలు భారత గడ్డపై నుంచి కార్యకలాపాలు సాగించడంపై భారత వైమానిక దళం చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. భారత్–జపాన్ మధ్య రక్షణ సహకారంలో ఇదొక ప్రధాన మైలురాయి అని అభిప్రాయపడ్డారు. అలాగే ఇండో–పసిఫిక్‌లో భారత్, జపాన్‌ల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక సమన్వయాన్ని నొక్కి చెప్పారు. ఇరు దేశాల వైమానిక దళాల మధ్య బలపడుతున్న సంబంధాలను వర్ణించడానికి అమర్ ప్రీత్ సింగ్ ఒక ప్రాచీన సంస్కృత పదబంధాన్ని ఉటంకించారు. "'అపత్సు మిత్రం' అంటే ఆపదలో ఆదుకునే స్నేహితుడు అని ఒక సంస్కృత నానుడి ఉంది. భారత వైమానిక దళం, జపాన్ ఎయిర్‌ఫోర్స్ మధ్య ఉన్న సంబంధంలో ప్రతిబింబించే స్ఫూర్తి కూడా సరిగ్గా అదేనని నేను భావిస్తున్నాను. ఇది పరస్పర గౌరవం, వృత్తి పరమైన విశ్వాసం, శాంతి, స్థిరత్వం పట్ల ఉమ్మడి నిబద్ధతపై నిర్మించిన భాగస్వామ్యం. జపాన్ యుద్ధ విమానాలు తొలిసారిగా భారత గడ్డపై నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున ఈ విన్యాసాలు ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తాయి. భారత్, జపాన్‌లు స్వేచ్ఛాయుత, బహిరంగ, నియమ ఆధారిత ఇండో–పసిఫిక్ అనే దార్శనికతను పంచుకుంటున్నాయి. ఇరు దేశాల వాయుసేనల మధ్య బలమైన సహకారం ఆయా దేశాల ఉమ్మడి లక్ష్యానికి దోహదపడుతుంది. ఈ విన్యాసాలు ఇరు దేశ వైమానిక దళాల మధ్య ఉన్న అత్యంత ఉన్నత స్థాయి నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రతిబింబిస్తాయి. భారత్, జపాన్‌లు కలిసి విన్యాసాలు చేసినప్పుడు ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటాం. కలిసి విమానాలు నడుపుతాం, కలిసి శిక్షణ పొందుతాం. కాబట్టి ఇరుపక్షాలు బలపడతాయి. సంయుక్త విన్యాసాలు ఇరుపక్షాలకు ఒకరి కార్యకలాపాల నుంచి ఒకరు నేర్చుకోవడానికి, వారి సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఒక అవకాశాన్ని అందిస్తాయి. "

**'తేజస్‌లో ప్రయాణాన్ని ఆయన ఆస్వాదించారని అనుకుంటున్నాను'**

జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ అధిపతి జనరల్ టకెహిరో మొరిటా ఈ రోజు (ఆదివారం) తేజస్‌లో ప్రయాణించారని భారత వైమానిక దళం చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఆయన ఈ విమానయానాన్ని ఆస్వాదించారని తాను ఆశిస్తున్నానని చెప్పారు. అయితే, భారత రక్షణ విమానయాన రంగం పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తిలో వేగంగా అభివృద్ధి చెందుతోందని అభిప్రాయపడ్డారు. పెద్ద సంఖ్యలో తేజస్ విమానాలకు ఆర్డర్లు ఇచ్చినప్పటికీ, ప్రపంచ సరఫరా గొలుసు సమస్యల కారణంగా కొన్ని డెలివరీలు ప్రభావితమయ్యాయని పేర్కొన్నారు. అధునాతన మధ్య తరహా యుద్ధ విమానమైన తేజస్ ఎంకే–2 అభివృద్ధి భారతదేశ రక్షణ విమానయాన పరిశ్రమ అభివృద్ధిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తుందన్నారు.

**మేక్ ఇన్ ఇండియాకు చిహ్నంగా తేజస్ : జపాన్ వైమానిక దళ చీఫ్**

మరోవైపు, భారతీయ యుద్ధ విమానాన్ని నడిపే అవకాశం లభించినందుకు జపాన్ ఎయిర్ సెల్ఫ్–డిఫెన్స్ ఫోర్స్ చీఫ్ జనరల్ టకెహిరో మొరిటా సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, ఈ అనుభవం భారత్–జపాన్ మధ్య పెరుగుతున్న రక్షణ భాగస్వామ్యంలో ఒక కీలకమైన అంశమని పేర్కొన్నారు. తేజస్ యుద్ధ విమానాన్ని దేశ సాంకేతిక ఆవిష్కరణకు, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి చిహ్నంగా అభివర్ణించారు. విమానాన్ని నడుపుతున్నప్పుడు, దీని అభివృద్ధికి దోహదపడిన సైనిక, పారిశ్రామిక రంగాల్లోని ఎందరో వ్యక్తుల కృషిని తాను స్మరించుకున్నానని చెప్పారు. తేజస్‌లో ప్రయాణాన్ని తాను ఒక అమూల్యమైన అనుభవంగానే కాకుండా, ఎన్నో ఏళ్లుగా మన రెండు దేశాల వైమానిక దళాల మధ్య ఏర్పడిన నమ్మకం, విశ్వాసం, భాగస్వామ్యానికి ఒక శక్తివంతమైన చిహ్నంగా కూడా గుర్తుంచుకుంటానని వివరించారు.

"ఈ రోజు మీతో (ఐఏఎఫ్ చీఫ్‌నుద్దేశించి) ఉండటం నాకు దక్కిన గౌరవం. మీరు అందించిన ఆత్మీయ స్వాగతానికి, ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తేజస్‌లో ప్రయాణించే ఈ అమూల్యమైన అవకాశానికి నేను ఎంతో కృతజ్ఞుడను. స్వదేశీ రక్షణ సామర్థ్యాలతో పుట్టిన విమానంగా, తేజస్ భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలకు ప్రతీకగా నిలుస్తుంది. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ప్రతిరూపంగా ఉంటుంది. వీర్ గార్డియన్ మన రెండు దేశాల మధ్య జరుగుతున్న రెండో ద్వైపాక్షిక యుద్ధ విమాన విన్యాసం. " అని జపాన్ వైమానిక దళ చీఫ్ జనరల్ టకెహిరో మొరిటా పేర్కొన్నారు.

## మనవాళ్లు చైనాకు పట్టుబడ్డప్పుడు నా పనైపోయిందనుకున్నా



జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తన ఉద్యోగ జీవితం తొలినాళ్లలో ఎదురైన ఓ క్లిష్టమైన సంఘటనను గుర్తుచేసుకున్నారు. చైనా సైన్యం తన బృందాన్ని అదుపులోకి తీసుకున్నప్పుడు, ఇక తన పనైపోయిందన్న ఆందోళనకు గురయ్యానని ఆయన వెల్లడించారు. ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఈ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. సిక్కిం భారత్‌లో విలీనమవుతున్న సమయంలో తాను యువ ఐపీఎస్ అధికారిగా అక్కడ ఇంటెలిజెన్స్ బాధ్యతలు చూసేవాడినని దోవల్ తెలిపారు. సరిహద్దుల్లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) కదలికలపై నిఘా పెట్టడం తన విధుల్లో భాగమని చెప్పారు. ఆ క్రమంలో, సరిహద్దు ప్రాంతంలో నిఘా కోసం ఒక బృందాన్ని పంపానని, వారు సుమారు 8 రోజుల్లో తిరిగి రావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే, రోజులు గడుస్తున్నా వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని దోవల్ వివరించారు. "5 రోజులు, 10 రోజులు, 15 రోజులు గడిచినా వారి ఆచూకీ తెలియలేదు. హిమపాతం వంటి ప్రమాదాలు జరిగినట్లు కూడా ఎక్కడా సమాచారం లేదు. దీంతో వృత్తిపరంగా, మానవతా దృక్పథంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాను" అని అన్నారు. కొన్ని రోజుల తర్వాత హెడ్ క్వార్టర్స్ నుంచి ఫోన్ వచ్చిందని, తాను పంపిన బృందం చైనా కస్టడీలో ఉందని ఉన్నతాధికారి చెప్పినప్పుడు మరింత ఆందోళన చెందానని తెలిపారు. చర్చల అనంతరం చైనా ఆ బృందాన్ని తిరిగి భారత్‌కు అప్పగించిందని దోవల్ చెప్పారు. "కానీ, వారు తిరిగి వచ్చినప్పుడు మానసికంగా, శారీరకంగా పూర్తిగా కుంగిపోయి ఉన్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ ప్రారంభం కావడంతో, చిన్న వయసులోనే తన కెరీర్ ముగిసిపోయిందని, మరో కొత్త ఉద్యోగం చూసుకోవాలని భావించినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు. అయితే, విచారణలో అసలు వాస్తవం బయటపడింది. తన బృందానికి హెడ్ క్వార్టర్స్ నుంచి అందించిన మ్యాపులు, స్కెచ్‌లలో లోపాలు ఉన్నాయని, ఆ తప్పిదం కారణంగానే వారు దారి తప్పి చైనా భూభాగంలోకి వెళ్లారని తేలింది. దీంతో ఈ ఘటనలో తన తప్పేమీ లేదని నిరూపితమైనట్లు దోవల్ తన పాత జ్ఞాపకాలను పంచుకున్నారు.

# యూపీలోని వీధుల్లో నడిచే మహిళను వేధించే సాహసం ఎవరూ చేయరు



ఉత్తర్‌ప్రదేశ్‌లో మహిళల భద్రతపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీలోని వీధుల్లో నడిచే మహిళను వేధించే సాహసం ఎవరూ చేయరని, అలా చేయడానికి ప్రయత్నించే వ్యక్తి తన మరణ శాసనంపై తానే సంతకం చేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. ఆదివారం లఖ్?నవూలో జరిగిన ఉత్తరప్రదేశ్ పోలీస్ శాఖలో కొత్తగా చేరిన సిబ్బందికి నియామక పత్రాల అందజేత అధికారిక కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో కఠిన విధానంతో నేరస్థుల్లో భయాన్ని కలిగించిందని చెప్పారు. యూపీ పోలీసు వ్యవస్థ దేశవ్యాప్తంగా అధ్యయనం చేయదగిన ఒక పరిపాలనా నమూనాగా మారిందని ముఖ్యమంత్రి అన్నారు.

"ఈ రోజుల్లో, వీధిలో నడిచే ఒక ఆడపిల్లను వేధించే సాహసం ఎవరైనా చేస్తారా? ఎవరైనా అలా చేస్తే దాని పర్యవసానాలు ఏమిటో వారికి తెలుసు. ఒకవేళ ఆ పర్యవసానాలు ఏమిటో వారికి తెలియకపోతే, వారు తమ మరణ శాసనంపై తామే సంతకం చేసుకుంటున్నారని అర్థం చేసుకోవచ్చు. దీని గురించి వారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే యూపీ పట్ల ప్రజల దృక్పథంలో వచ్చిన మార్పునకు, ఈ కొత్త ఇమేజ్‌ను రూపొందించడానికి యూపీ పోలీసులే స్వయంగా కృషి చేశారు."

తన హయాంలో మతపరమైన అశాంతి పూర్తిగా తొలగిపోయిందని సీఎం యోగి వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లో అల్లర్లు అనేవి గతంలో మాటగా మారిపోయాయని అన్నారు. "యూపీలో అల్లర్లు జరగడం లేదా? అశాంతి లేదా? అని కొందరు అడుగుతుంటారు. లేదు, ఇప్పుడు అల్లర్లు జరగడం లేదు. అల్లర్లు ఎలా ఉండేవో ప్రజలు మర్చిపోకూడదనే ఉద్దేశంతో అప్పుడప్పుడు కేవలం 'మాక్ డ్రిల్స్' మాత్రమే నిర్వహిస్తుంటాం! అని వారికి చెబుతాను." ముఖ్యమంత్రి అన్నారు. "యూపీలో రోజూ అల్లర్లు చెలరేగేవి. కర్ఫ్యూలు నెలల తరబడి కొనసాగేవి. అలీగఢ్‌లో, మేరఠ్?లో అల్లర్లు జరిగాయి. ముజఫర్‌నగర్‌లో ఆరు నెలల పాటు అల్లర్లు నిర్విరామంగా కొనసాగాయి. సామాన్య పౌరులు, వ్యాపారుల సంగతి పక్కన పెట్టండి. ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, చివరకు న్యాయవ్యవస్థకు కూడా మాఫియా ఒక సవాలుగా ఉండేది! ఒకవేళ మాఫియా కాన్వాయ్ వెళుతుంటే ముందు వారిని వెళ్లనిచ్చేందుకు న్యాయాధికారుల వాహనాలను ఆపేసేవారు. ఈ రోజు, ఏ గ్యాంగ్‌స్టర్ అయినా బహిరంగ జీపులో ఆయుధాలు ప్రదర్శిస్తూ బీభత్సం సృష్టించగలడా? ఈ రోజు, పండుగలకు ముందు అశాంతిని రెచ్చగొట్టడానికి ఎవరైనా ధైర్యం చేస్తారా? ఈ రోజు ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రంలో ఎవరైనా వరుస అల్లర్లను ప్రేరేపించగలరా? ఈ మొత్తం పరివర్తనకు యూపీ పోలీసులు కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా పరిపాలనా నమూనాల గురించి చర్చ నడిచినప్పుడల్లా, యూపీ పోలీస్? మోడల్? గురించి కూడా మాట్లాడుకోవడం మీరు గమనించే ఉంటారు."

ప్రభుత్వ నియామకాల్లో వ్యవస్థాగత అవినీతికి పాల్పడ్డారని గత ప్రభుత్వాలపైనా యూపీ సీఎం యోగి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు మొత్తం పోలీసు నియామక వ్యవస్థే అపఖ్యాతి పాలైందని గుర్తుచేశారు. పరిపాలనా యంత్రాంగంపై ప్రజలకు నమ్మకాన్ని పునరుద్ధరించడానికి పారదర్శకమైన, ప్రతిభ ఆధారిత నియామక ప్రక్రియ అత్యవసరమని సీఎం యోగి స్పష్టం చేశారు. "గతంలో పరీక్షల విశ్వసనీయతపై నిరంతరం ప్రశ్నలు తలెత్తేవి. ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు విపరీతంగా ఉండేవి. అంతేకాకుండా పరీక్ష ఒకరు రాస్తే నియామక పత్రం మరొకరు తీసుకునే దుస్థితిలో యూపీ పోలీస్ వ్యవస్థ ఉండేది! అసలు దరఖాస్తు చేసుకోని వారికి కూడా ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చేవారు. కానీ నిజమైన, అర్హులైన అభ్యర్థులకు మాత్రం నిరాశే మిగిలేది. దీనిపై సుదీర్ఘ విచారణలు జరిగినప్పటికీ, ఫలితం మాత్రం శూన్యం." అని యోగి

## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్



బీజేపీ– ఆర్ఎస్ఎస్ దేశంలోని విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి, అవినీతిమయం చేశాయని కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఆరోపించింది. అయితే, వ్యవస్థలోని లోపాలపై జవాబుదారీతనం కోసం పరితపిస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్? గాంధీ అండగా నిలుస్తున్నారని స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి కంచుకోట అయిన ఇండోర్‌లో శనివారం రాహుల్ గాంధీ నిర్వహించిన ఐదో విడత 'ఛాత్రోన్ కీ గూంజ్' సదస్సుపై కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్? ఎక్స్? వేదికగా స్పందించారు. విద్యార్థులను అణచివేస్తున్న ప్రస్తుత వ్యవస్థ వెనుక ఉన్నది బీజేపీ ఆర్ఎస్ఎస్ వాళ్లేనని ఆరోపించారు.

"విద్య, ఆర్థిక వ్యవస్థ, రాజకీయం ఇలా దేశంలోని ప్రతి రాజ్యాంగ సంస్థపై వారి నియంత్రణ ఉంది. వారు విద్యా వ్యవస్థను గుల్లగా మార్చి, అవినీతిమయం చేశారు. విద్యార్థులను అణచివేస్తున్న ఈ వ్యవస్థ రహస్యాన్ని రాహుల్ గాంధీ శనివారం జరిగిన కార్యక్రమంలో బయటపెట్టారు. విద్యార్థులు ప్రశ్నలు అడుగుతారని, జవాబుదారీతనం కోరతారని ఆ వ్యవస్థ భయపడుతోంది. కానీ, ఇప్పుడు రాహుల్ గాంధీ వారికి అండగా నిలబడడంతో విద్యార్థుల్లో భయం తొలగిపోయింది. ప్రస్తుతం వారి గొంతు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది."

**రాహుల్ గాంధీ ఏమన్నారంటే?**

దేశం నుంచి ద్వేషాన్ని తరిమిగొట్టగలిగేది అంధ భక్తులు కాదని, ఆ పని కేవలం విద్యార్థులవల్లే అవుతుందని రాహుల్? గాంధీ స్పష్టం చేశారు. ఛాత్రోం కీ గూంజ్? ఐదో కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్?లోని ఇందౌర్?లో శనివారం విద్యార్థులతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీలకు మద్దతుగా నిలుస్తున్న వారిని అంధ భక్తులుగా ఆయన అభివర్ణించారు. యావద్దేశం వ్యవస్థ గుప్పిట్లో ఉందని, విద్యార్థులు ప్రశ్నించడాన్ని అది కోరుకోవట్లేదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఏ దేశానికైనా యువతే భవితవ్యమని, వారు లేకుండా దేశాలేవీ బలపడలేవని స్పష్టం చేశారు. దేశంలో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, లక్ష పాఠశాలలు మూతపడ్డాయని దుయ్యబట్టారు. యూపీఏ సర్కారు ఉన్నప్పుడు విద్య కోసం 4.6% బడ్జెట్‌ను కేటాయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం 2.6 శాతం కేటాయించిందని ధ్వజమెత్తారు. అలాగే, సోషల్ మీడియా సహా అన్నింటినీ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ నియంత్రిస్తున్నారని, నిఘా కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎంపీపీఎస్సీలో అక్రమాలను ప్రశ్నిస్తే తమపై కేసు నమోదు చేసి జైలుకు పంపారని దేవాస్‌కు చెందిన ఓ విద్యార్థి తెలిపారు. మధ్యప్రదేశ్‌లో నియామక పరీక్షలకు సంబంధించిన 13 శాతం కోటాను నిలిపివేసిన అంశాన్ని పలువురు విద్యార్థులు రాహుల్?తో పంచుకున్నారు. దేశ రాజకీయ, సంస్థాగత, ఆర్థిక అంశాలపై ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ఆర్ఎస్ఎస్ చీఫ్? మోహన్ భాగవత్, పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీలు నియంత్రణను కలిగి ఉన్నారని ఆరోపించారు.

**మోదీపై చేసిన విమర్శలను ఖండించిన బీజేపీ**

ఇదిలా ఉండగా, ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్? చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్? క్షమించరాని నీచ స్థాయికి దిగజారిందని బీజేపీ అధికార ప్రతినిధి యాసర్? జిలానీ ఆదివారం ఆరోపించారు. గతంలో నిర్వహించిన ఒక ర్యాలీలో మోదీ తల్లి పట్ల, మాతృత్వం పట్ల గౌరవాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు. అలాగే ఇందౌర్? జరిగిన వ్యాఖ్యలు అనుచితమైనవని, దాన్ని ప్రజలు ఎప్పటికీ క్షమించరని వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఆరోపణలను కాంగ్రెస్? తీవ్రంగా ఖండించింది. ఛాత్రోం కీ గూంజ్? కార్యక్రమంలో మోదీ తల్లి గురించి ఎవరూ తప్పుగా మాట్లాడలేదని కాంగ్రెస్? నాయకుడు రాకేశ్? సిన్హా తెలిపారు. ఆమె అందరికి తల్లి వంటివారని పేర్కొన్నారు.

# "ఓటర్ల తొలగింపు వెనుక అమిత్ షా ఉన్నారు"

ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ మరోసారి ఆరోపణలు చేసింది. వివిధ రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. తొలగించిన వారిలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన, అణగారిన వర్గాలకు చెందినవారే ఎక్కువగా ఉన్నారని నిరూపించేందుకు ఆధారాలు ఉన్నాయని ఆయన అన్నారు. సర్‌ను 'అమిత్ షా ప్రేరేపిత ఓటర్ల తొలగింపు' ప్రక్రియగా కాంగ్రెస్ అభివర్ణించిందని తెలిపారు. దీనిని రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం 2025 జూన్‌లో బిహార్‌లో ప్రారంభించిందని జైరాం రమేశ్ తెలిపారు. అనంతరం 2025 నవంబర్‌లో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రెండో దశను చేపట్టిందని పేర్కొన్నారు. ఈ రెండు దశల్లో కలిపి 7.8 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్‌కు ముందు ఉన్న ఓటర్ల జాబితాతో పోలిస్తే ఇది 13 శాతం తొలగింపు రేటు అని చెప్పారు. 2026 మధ్యకాలంలో 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం మూడో దశలో 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన గణాంకాలను పరిశీలిస్తే, మొత్తం 36.06 కోట్ల మంది ఓటర్లలో 6.18 కోట్ల మంది పేర్లు తొలగించారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. దీని ప్రకారం తొలగింపు రేటు 17 శాతానికి పైగా ఉందన్నారు. మరో 5.43 కోట్ల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసి, ఓటర్ల జాబితాలో తమ పేర్లు కొనసాగించేందుకు అదనపు పత్రాలు సమర్పించాలని కోరుతున్నారని తెలిపారు.

**మరో 15 శాతం మంది పేర్లకు ముప్పు**

పత్రాలు సమర్పించాల్సిందిగా నోటీసులు అందుకున్న 5.43 కోట్ల మంది పేర్లు కూడా తొలగించే అవకాశం ఉందని జైరాం రమేశ్ అన్నారు. దీంతో మొత్తం 32 శాతం మంది ఓటర్లు, అంటే దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరు, ఇప్పటికే పేర్లు తొలగించిన లేదా తొలగింపు ముప్పును ఎదుర్కొంటున్న పరిస్థితిలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో పేర్లను తొలగించిన తర్వాత కూడా ఇంకా ధ్రువీకరణ అవసరమైన ఓటర్లు ఇంత పెద్ద సంఖ్యలో ఎలా ఉన్నారని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఈ గణాంకాలు సర్? ప్రక్రియలో నిర్మాణాత్మక లోపాలు ఉన్నాయనే విషయాన్ని చూపిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఇవన్నీ కాంగ్రెస్ చేసిన ఆరోపణలేనని, ఎన్నికల సంఘం అధికారిక గణాంకాలతో వాటిని వేరు చేసి చూడాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం ప్రకారం మూడో దశలో 36.73 కోట్ల మంది ఓటర్లను ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరించే ప్రక్రియ చేపట్టారు.

**రాష్ట్రాల వారీగా కాంగ్రెస్ ప్రస్తావించిన గణాంకాలు**

సర్?లో భాగంగా పలు రాష్ట్రాల్లో పేర్ల తొలగింపు, తొలగింపు ముప్పు అధికంగా ఉందని కాంగ్రెస్ పేర్కొంది. జైరాం రమేశ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం, దిల్లీలో 53.73 శాతం, చండీగఢ్‌లో 52.58 శాతం, ఝార్ఖండ్‌లో 39.57 శాతం, ఉత్తరాఖండ్‌లో 35.71 శాతం, మేఘాలయలో 35.36 శాతం, మహారాష్ట్రలో 33.88 శాతం, తెలంగాణలో 48.90 శాతం, కర్ణాటకలో 27.6 శాతం, హరియాణాలో 37.5 శాతం, ఒడిశాలో 23.67 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 21.17 శాతం, పంజాబ్‌లో 15.23 శాతం ఉన్నాయని తెలిపారు.

కర్ణాటక, తెలంగాణ, ఝార్ఖండ్‌లో తొలగింపు ముప్పును ఎదుర్కొంటున్న ఓటర్ల జాబితాలను బహిరంగంగా అందుబాటులో ఉంచారని జైరాం రమేశ్ తెలిపారు. దీనివల్ల ఓటర్లు తమ పేర్లు ఆ జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకునే అవకాశం ఉందన్నారు. దిల్లీ ఈ జాబితాను సెప్టెంబర్ 19న ప్రజల ఒత్తిడి మేరకు మాత్రమే బహిరంగంగా అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆయన ఆరోపించారు.

# యాక్షన్ ప్లాన్ తయారు చేయండి

-మొదటిపేజీ తరువాయి

పని చేయాలి. ఎల్ నినో ప్రభావం కేవలం రైతుల మీదే కాదు... అన్ని వ్యవస్థలపై పడుతుంది. ఎల్ నినో బారి నుంచి రైతులను కాపాడే ప్రయత్నం చేస్తూనే... ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. డిమాండ్ కు అనుగుణంగా వివిధ పంటలు సాగు చేయాలి. పంటల బీమా చేయించాం... పంట నష్టం సంభవిస్తే.. బీమా మొత్తం రైతులకు దక్కేలా చేయాలి. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసరాల ధరలను కంట్రోల్ చేయాలి. గోడౌన్లలో బియ్యం నిల్వలు ఎంత మేరకు ఉన్నాయో పరిశీలించాలి.

బియ్యం ధరలను అదుపులో ఉంచేందుకు బియ్యం నిల్వలను మార్కెట్లులోకి వదిలేలా చర్యలు తీసుకోవాలి.

ప్రస్తుతం ఉల్లి ధరలను కంట్రోల్ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఉల్లిని కొనుగోలు చేస్తున్నాం.

రానున్న కాలంలో ఉల్లికి ఉన్న డిమాండ్ కు అనుగుణంగా ఉల్లి సాగును ప్రొత్సహించాలి. ఇక పామాయిల్, కందిపప్పు ధరలను అదుపులో పెట్టేలా ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను త్వరితగతిన అమలు చేయాలి. కిచెన్ గార్డెన్లను ప్రొత్సహించండి... స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్ల ద్వారా కూరగాయలు పండించేలా చూడాలి. కిచెన్ గార్డెన్లను ప్రొత్సహించి... వ్యవస్థీకృతం చేయగలిగితే కూరగాయల ధరలు అదుపులో ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం కొన్ని పంటలకు కనీస మద్దతు ధర అందిస్తుంది... దీనిపై కేంద్రంతో సమన్వయం చేసుకోండి. విపత్తులు సంభవించినప్పుడు ఆ ప్రభావం ప్రజలపై పడకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదు. ఎల్ నినో విపత్తును సవాలుగా



స్వీకరించాలి.

ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, రైతు, సాగు నీటి సంఘాలు సమన్వయంతో పని చేయాలి. కొన్ని రోజులుగా వర్షాలు పడుతున్నాయి.. ఇలా పడుతున్న వర్షాలను సద్వినియోగం చేసుకోవాలి. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన పంటలపై హై రిస్క్ ఉంది... ఈ ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించాం.. ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ఒక్కరికీ తాగునీటిని అందించాలి. పశువులకు నీటిని అందించడంతోపాటు.. పశుగ్రాసం అందేలా చూడాలి. డిమాండ్ కు అనుగుణంగా పంటలను సాగు చేయడం.. పశుగ్రాసం పెంచడం.. మల్చింగ్ కోసం విత్తనాలు జల్లడం వంటివి చేయాలి. పచ్చదనం ఎంత మాత్రం తగ్గకుండా చర్యలు తీసుకోవాలి. వీబీ జీ రామ్ జీ పనులను అనుసంధానం చేసుకుంటూ జలధార కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలి. రాష్ట్ర వ్యాప్తంగా 50.7 శాతం మేర లోటు వర్షపాతం నమోదైంది.

ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అత్యధిక లోటు వర్షపాతం కన్పిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో 30.84 లక్షల హెక్టార్లల్లో సాగు చేయాల్సి ఉండగా... ఎల్ నినో కారణంగా 79 శాతం భూముల్లో సాగు పనులు మొదలు పెట్టారు.

పప్పు ధాన్యాల సాగు మెరుగ్గా ఉన్నా... నూనె గింజల సాగు తక్కువగా ఉంది. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లోని పంటలపై ఎల్ నినో ప్రభావం ఎక్కువగా కన్పిస్తోంది.

ఇప్పటికే సిద్దం చేసుకున్న కంటింజెన్సీ ప్లాన్ ను సమర్ధవంతంగా అమలు చేయాలి. 5.21 లక్షల హెక్టార్లకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు సరఫరా చేశాం.

1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో సరఫరా చేశాం. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ. 60 కోట్లు సిద్దం చేసుకున్నాం. అధికారులు క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలి.

స్థానిక ఎన్నికలు ఉన్నప్పటికీ ప్రజా ప్రతినిధులు ఎల్ నినో అంశంపై గ్రామాల్లో ఎక్కువగా పర్యటించి రైతుల్లో అవగాహన పెంచాలి. పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాల సాగును ప్రొత్సహించడంతో పాటు... డిమాండ్ ఎక్కువగా ఉన్న పంటలను సాగు చేసేలా రైతుల్లో అవగాహన పెంచాలి.

వర్షాభావ పంటల సాగు.. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలనీ సూచించారు.

# రూ.3,200 కోట్ల ముడుపులు ఎవరివి?

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం విధానం ద్వారా వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడటమే కాకుండా, విషతుల్యమైన మద్యాన్ని అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు. రూ.3,200 కోట్ల భారీ మద్యం కుంభకోణంపై, కీలక అధికారి సత్యప్రసాద్ వెల్లడించిన అంశాలపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అక్రమాలను, దోపిడీని తీవ్రంగా ఎండగట్టారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి, అధికారులను ఒత్తిడికి గురిచేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.

మద్యం విధానంలో భాగంగా సుమారు రూ.3,200 కోట్ల ముడుపులు చేతులు మారినట్లు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ సత్యప్రసాద్ కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. ఈ కుంభకోణానికి సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ అప్పటి ముఖ్యమంత్రి నివాసమైన తాడేపల్లి ప్యాలెస్‌లోనే తీసుకున్నారని సత్యప్రసాద్ చెప్పినట్లు వార్తలు వస్తున్నాయని తెలిపారు. "నిజాలు బయటపెడుతున్న సత్యప్రసాద్ మానసిక స్థితి సరిగా లేదని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. తమకు అనుకూలంగా



ఉన్నప్పుడు ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లేనా? ఇప్పుడు వాస్తవాలు వెల్లడిస్తుండటంతోనే ఇలాంటి ముద్ర వేసి అసలు అంశాన్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాలు ఆపి, ఆరోపణలకు సూటిగా సమాధానం చెప్పాలి" అని పార్థసారథి సవాల్ విసిరారు.

**నగదు లావాదేవీల వెనుక మర్మమేంటి?**

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులను పూర్తిగా తొలగించి, కేవలం నగదు లావాదేవీలనే ప్రోత్సహించడం వెనుక ఉన్న మర్మమేంటని పార్థసారథి ప్రశ్నించారు. "కోట్లాది రూపాయల మద్యం విక్రయాలు నగదు రూపంలోనే జరగాలని ఎందుకు ఆదేశించారు? ఆ డబ్బు ఎక్కడికి వెళ్లింది? కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడం, మాన్యువల్ విధానంలో ఆర్డర్లు కేటాయించడం వంటి చర్యలన్నీ అవినీతి కోసమే" అని ఆయన ఆరోపించారు. మద్యం రవాణా కాంట్రాక్టులను కూడా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి కేంద్రీకరించి, రేట్లు పెంచి తమ అనుయాయులకు కట్టబెట్టారని విమర్శించారు. మద్యం దుకాణాల్లో సిబ్బంది నియామకాలు, వారి జీతాల చెల్లింపుల్లోనూ భారీగా అక్రమాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటం**

2019 ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్య నిషేధం అని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నాసిరకం మద్యాన్ని అమ్మి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టారని పార్థసారథి మండిపడ్డారు. కల్తీ మద్యం తాగి ఎంతోమంది అనారోగ్యం పాలయ్యారని, ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాల్లో నాణ్యతకు, పారదర్శకతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. గౌడ సామాజిక వర్గానికి 10 శాతం దుకాణాలు కేటాయించామని, 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ ద్వారా నాణ్యతను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. 13 రకాల పరీక్షల తర్వాతే మద్యాన్ని అమ్ముతున్నామని, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమాలకు తావులేకుండా చూస్తున్నామని వివరించారు. మద్యం కుంభకోణంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై జగన్ రెడ్డి తన మౌనాన్ని వీడి, ప్రజలకు వాస్తవాలు చెప్పాలని పార్థసారథి పునరుద్ఘాటించారు.

# విద్యాశాఖలో రాజకీయాలకు చోటులేదు

క్లాస్‌రూమ్ నుంచే సమాజంలో మార్పు సాధ్యమని, విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్. సాంకేతికతకు భారతీయ విలువలు జోడిస్తే ప్రపంచ విజేతలుగా ఎదగవచ్చని చెప్పారు. విద్యాశాఖలో రాజకీయాలకు చోటు లేకుండా 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

కాకినాడ జిల్లాలో మంత్రి లోకేశ్ పర్యటించారు. కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో నిర్వహించిన భారతీయం కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొనడానికి వచ్చిన లోకేశ్?కి ప్రముఖ ప్రవచనకర్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే చిన్నరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ ఘన స్వాగతం పలికారు.

విద్యార్థులు ఆలపించిన వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులను మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, లాల్‌బహదూర్ శాస్త్రి, అంబేద్కర్, అబ్దుల్ కలామ్, విశ్వేశ్వరయ్య తదితరుల పాత్రలను విద్యార్థులు ప్రదర్శించారు. వారి దేశభక్తి సందేశాలు ఆకట్టుకున్నాయి. చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు నైతిక విలువలు, దేశభక్తిపై సందేశం ఇచ్చారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ విద్యార్థులతో ముచ్చటించారు. లోకేశ్ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశభక్తి, త్యాగధనుల స్ఫూర్తి, విలువల విద్యపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

సాంకేతికతకు భారతీయ విలువలు తోడైతే, ప్రపంచ విజేతలుగా ఎదగొచ్చని పిల్లల్లో చిన్నప్పటి నుంచే పెద్దలను, మహిళలను గౌరవించడం గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించడం నేర్పించాలని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సంస్కరణలను ప్రస్తావించిన మంత్రి లోకేశ్ ఈ ఏడాది లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని, ఇంటర్‌లోనూ పది వేల




అడ్మిషన్లు పెరిగాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. నైతిక విలువలు కూడా తోడైతే ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేశంలోనే ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు.

**నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్**

విద్యాశాఖలో రాజకీయాలకు చోటు లేకుండా 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూస్‌లో రాజకీయ పార్టీ రంగులు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. సమాజంలో మార్పు క్లాస్‌రూమ్ నుంచే ప్రారంభమవుతుందని ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థి కేంద్రంగా ఉండాలన్నారు.

"ఏఐ, రోబోటిక్స్ గురించి మాట్లాడుతున్నాం వాటికి భారతీయం, నైతిక విలువలు తోడవ్వాలి' అని అప్పుడే మనం ప్రపంచ విజేతలుగా ఎదుగుతామని లోకేశ్ చెప్పారు. చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ఎదురొడ్డి నిలవాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. మార్కులు తక్కువ వచ్చాయని, అనుకున్నది సాధించలేకపోయామని తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పారు. ఇంట్లో చెప్పుకోలేని సమస్యలు ఉంటే ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల త్యాగాలను గుర్తుంచుకుని వారు గర్వపడేలా ఎదగాలని పిలుపునిచ్చారు.

"విద్య వల్ల సమాజంలో మార్పు తీసుకురావచ్చు. నాకు విద్యాశాఖను ఇవ్వాలని సీఎంను కోరాను. విద్య, ప్రభుత్వ స్కూళ్లంటే సీఎంకు చాలా ఇష్టం. విద్యావ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి. గతంలో బాపట్లలో జరిగిన మెగా పీటీఎంకు సీఎం వచ్చారు. నాడు పిల్లలకు పెట్టే భోజనమే సీఎంకు వడ్డించారు. ఈ భోజనం క్వాంటిటీ సరిపోదు, పెంచాలని సీఎం చెప్పారు. ఎక్కడా లేని విధంగా ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగాయి. ఓర్పు, సహనం, నైతిక విలువలు మనకు చాలా అవసరం. దేశం కోసం ఆలోచించాలి, దేశం కోసం త్యాగం చేయాలి." – నారా లోకేశ్, విద్యాశాఖ మంత్రి

**సక్సెస్‌కు షార్ట్‌కట్ ఉండదు**

సక్సెస్‌కు షార్ట్‌కట్ ఉండదని హార్డ్‌వర్క్‌తోనే మంచి స్థాయికి వెళ్లగలమని లోకేశ్ అన్నారు. గెలుపు, ఓటమి రెండింటినీ సమానంగా తీసుకోవాలని తల్లిదండ్రులు తలదించుకునేలా కాకుండా తలెత్తుకునేలా చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రముఖ ప్రవచన కర్త, ప్రభుత్వ సలహాదారుడు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. దేశ స్వాతంత్ర్యం గత చరిత్ర మాత్రమే కాదని అది భారతీయుల వారసత్వ సంపద అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన ప్రదేశాలను సందర్శించడం ద్వారా పిల్లల్లో దేశభక్తి మరింత పెరుగుతుందని చెప్పారు.

స్వాతంత్ర్య పోరాటం గత చరిత్ర కాదు మన భారతీయుల వారసత్వ సంపద అని చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛను అందించారన్నారు. ఆ త్యాగాల విలువను తెలుసుకుని భావితరాలకు అందించాలన్నారు. గాంధీ నుంచి అంబేద్కర్ వరకు ప్రకాశం పంతులు నుంచి పొట్టి శ్రీరాములు వరకు దేశం కోసం జీవితాలను అంకితం చేసిన మహనీయుల చరిత్రను పిల్లలకు తెలియజేయాలని చాగంటి కోటేశ్వరరావు సూచించారు.

దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే కాదని స్వేచ్ఛ వెనుక ఉన్న త్యాగాలను గుర్తుంచుకోవడమని చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి నైతిక విలువలు చరిత్ర పట్ల గౌరవం పెంపొందించేందుకు నిర్వహించిన భారతీయం కార్యక్రమం త్యాగధనుల స్ఫూర్తిని మరోసారి గుర్తుచేసింది.

## అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ ముఖ్యమే



-మొదటిపేజీ తరువాయి

"కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల గురించి అందరూ ఆలోచించాలి. అభివృద్ధి ఆగకూడదు, అదే సమయంలో పర్యావరణానికి గాయం చేయకూడదు. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి" అని ఆయన సూచించారు.

దశాబ్దాలుగా నగరాల విస్తరణ 'గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఆధారంగా జరిగిందని, ఇప్పుడు గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ వంటి విధానాలు అత్యవసరమని పేర్కొన్నారు. వనరులను అధికంగా వాడే భవనాలు కాకుండా, తెలివిగా వినియోగించుకునే నిర్మాణాలను చేపట్టాలని ఉద్బోధించారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకునే 'ది ఎర్త్ సెంటర్' నిర్మాణం జరిగిందని, ఇలాంటి భవనాలకే భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు ప్రశంసించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ, రీ-సైకిల్ చేసిన టెర్రకోట వంటి పదార్థాలతో ఈ భవనాన్ని నిర్మించడం అభినందనీయమని అన్నారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

వాతావరణ మార్పులనేవి భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని, ఇప్పటికే మన ముందున్న పెను సవాలని చంద్రబాబు హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. భవన నిర్మాణాల్లో 'నెట్ జీరో' విధానాన్ని పాటించాలని, సోలార్ విద్యుత్ వినియోగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "ప్రతి ఇంటి పైకప్పు ఒక పవర్ ప్లాంట్‌గా మారవచ్చు. ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించవచ్చు. ప్రతి వ్యర్థాన్ని ఒక వనరుగా మార్చవచ్చు. నీటిని, నేలను కాపాడటమంటే సంపదను సృష్టించడమే" అని ఆయన వివరించారు. చెత్తను కంపోస్టుగా మార్చుకోవడం, రీ-యూజ్ విధానాన్ని అవలంబించడం ద్వారానే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కర్ణాటక, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని అన్నారు.

**అమరావతి – ఒక పర్యావరణ హిత నగరం**

వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ గురించి మాట్లాడుతున్నామని, పట్టణాభివృద్ధిలోనూ అదే స్ఫూర్తి అవసరమని చంద్రబాబు అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సాధించాలనే జాతీయ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. ఏపీలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. ఈ స్ఫూర్తితోనే అమరావతిని పూర్తి పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని పునరుద్ఘాటించారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రకృతిని పరిరక్షిస్తూ ఈ అద్భుత ప్రాజెక్టును రూపొందించిన విస్టా స్పేసెస్ బృందాన్ని, వెంకటరమణన్ అసోసియేట్స్ ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

## పాకిస్తాన్ లో పెట్రోల్ 384.34, డీజిల్ ధర 415.83

**ఇస్లామాబాద్ :** పశ్చిమాసియాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధనాన్ని ఆదా చేసేందుకు పాకిస్థాన్ పొదుపు చర్యలను ప్రకటించింది. ఈ ఏడాది పాక్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇది రెండోసారి. పాకిస్థాన్ మంత్రివర్గం ఆమోదించిన ఈ నిబంధనలు మూడు నెలల పాటు అమలులో ఉంటాయి. ఈ వారంలోనే పాకిస్థాన్ ప్రభుత్వం లీటర్ పెట్రోల్‌పై పీకేఆర్ 4.10, హై-స్పీడ్ డీజిల్‌పై పీకేఆర్ 6.41 చొప్పున ధరలను పెంచింది. దీంతో పెట్రోల్ ధర పీకేఆర్ 384.34కు, డీజిల్ ధర పీకేఆర్ 415.83కు చేరాయి. హార్మూజ్, బాబ్-ఎల్-మండేబ్ జలసంధుల వద్ద భద్రతా పరిస్థితులు క్షీణించడం వల్ల చమురు సరఫరాకు అంతరాయం కలగొచ్చని అధికారికంగా హెచ్చరిస్తూనే ఈ ధరల పెంపును ప్రకటించారు. అదే సమయంలో రియాద్ ఈస్ట్-వెస్ట్ పైప్‌లైన్‌పై దాడితో సహా సౌదీ ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన దాడుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తుల ధరల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ వాహనాలకు ఇచ్చే ఇంధన కోటాను తగ్గించాలని పాకిస్థాన్ ఆదేశించింది. కొత్త వాహనాల కొనుగోలు, అధికారుల విదేశీ పర్యటనలు, అధికారిక విందులపై (విదేశీ ప్రతినిధులు, సందర్శకులకు ఇచ్చే విందులు మినహా) నిషేధం విధించింది. దీంతో పాటు, ఐటీ సేకరణ మినహా ఇతర మన్నికైన వస్తువులను ప్రభుత్వం కొనుగోలు చేయడాన్ని నిషేధించారు. సమావేశాలను టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించాలని నిర్ణయించారు. మార్కెట్లను రాత్రి 9 గంటలకు, కళ్యాణ మండపాలను 10 గంటలకు, రెస్టారెంట్లను 11 గంటలకు మూసివేయాల్సి ఉంటుంది. అయితే ఔషధ దుకాణాలు, మెడికల్ ల్యాబ్‌లకు ఈ ఆంక్షల నుండి మినహాయింపు ఇచ్చారు. ఏప్రిల్‌లో విధించిన పొదుపు చర్యలను, ఇరుపక్షాల మధ్య శాంతి చర్చలు ప్రారంభం కావడంతో జూన్‌లో ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం ఈ ఆంక్షలు ఇస్లామాబాద్‌కే పరిమితమైనప్పటికీ, ప్రావిన్సులు (రాష్ట్రాలు), ప్రాంతీయ ప్రభుత్వాలు కూడా ఇవే విధానాలను అమలు చేయాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో విపరీతంగా పెరుగుతున్న ధరలు, ప్రభుత్వంపై భారాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని ఎలా దెబ్బతీస్తున్నాయో పాక్ ఇంధన శాఖ మంత్రి అవాయిస్ లెఘారీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్‌లు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. మరోవైపు, పెంచిన ధరలను తగ్గించకపోతే వచ్చే వారం దేశవ్యాప్త నిరసనలు చేపడతామని 'జమాత్-ఇ-ఇస్లామీ' (ఏఐ) పార్టీ హెచ్చరించడంతో ప్రజాందోళనలు చెలరేగుతాయనే ఒత్తిడిలో ప్రభుత్వం ఉంది.

## రావణ్ కష్టాలు తీరినట్టేనా

**విజయవాడ :** సోషల్ మీడియా వేదికగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేలా ప్రేరేపించారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ కేసులో గన్నవరం న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు విచారణను లోతుగా చేపట్టేందుకు నిందితుడిని ఏడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగించాలని దర్యాప్తు అధికారులు వేసిన పిటిషన్‌ను కోర్టు ఆమోదించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం నుంచి గన్నవరం పోలీసులు జోసెఫ్‌ను తమ కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించనున్నారు. యువతను తీవ్రవాదం వైపు ఆకర్షితులయ్యేలా రెచ్చగొట్టే వీడియోలు రూపొందించడం, ఏలూరులో నిర్వహించిన ఒక సమావేశంలో మావోయిస్టు సిద్ధాంతాలను సమర్థిస్తూ, నక్సలిజం వైపు మళ్లేలా ప్రసంగాలు చేశారనే ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఇప్పటికే ఆయనపై కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను కూల్చివేయాలనేలా ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజా శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగించేలా ఉన్నాయని ప్రాథమిక దర్యాప్తులో అధికారులు నిర్ధారించారు. ఈ నేరపూరిత నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు సూత్రధారులను వెలికితీయడానికి కస్టడీ విచారణ తప్పనిసరి అని పోలీసులు కోర్టులో వాదించారు. ముఖ్యంగా కొందరు మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో జోసెఫ్‌కు ఉన్న సంబంధాలు, అతనికి వెనుకనుండి అందుతున్న నిధుల మూలాలు, ఈ ప్రసంగాల వెనుక దాగి ఉన్న రాజకీయ ప్రయోజనాలపై సమగ్రంగా ఆరా తీయాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి, కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుంటూ వారం రోజుల పోలీస్ కస్టడీకి అనుమతినిచ్చారు. కోర్టు అనుమతి లభించడంతో రేపటి నుంచి ప్రారంభమయ్యే విచారణ అత్యంత కీలకంగా మారింది. కస్టడీ సమయంలో జోసెఫ్ డిజిటల్ పరికరాలు, సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ, తెరవెనుక సహకరించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరించనున్నారు. ఈ ఏడు రోజుల విచారణలో ఎలాంటి నిజాలు, కుట్ర కోణాలు వెలుగులోకి వస్తాయనేది కీలకం.

# అరటి గెలలో పొంచివున్న మృత్యువు!

**కట్లపాము కాటుతో ఆరేళ్ల బాలుడు మృతి**

**కాటేసిన విషయం ఆలస్యంగా గుర్తించడంతో విషాదం**

**చింతలచెరువు గ్రామంలో మిన్నంటిన రోదనలు**



**ఎటపాక, సెప్టెంబర్ 20 (ప్రజాజ్యోతి):** అరటి గెల రూపంలో వచ్చిన మృత్యువు ఆ పసివాడి ప్రాణాలను బలిగొంది. ఇంట్లోకి వచ్చిన కట్లపాము కాటువేయడంతో ఆరేళ్ల బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన హృదయ విదారక ఘటన మండల పరిధిలోని చింతలచెరువులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుర్సం ధర్మరాజు, విజయ దంపతుల కుమారుడు జై ప్రణయ్ (6) ఆడుకుంటూ మృత్యువాత పడటంతో కుటుంబంలో తీరని శోకం మిగిలింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం సుమారు 12 గంటల సమయంలో బాలుడి తల్లి విజయ ఇంటి ఆవరణలోని అరటి చెట్టు నుంచి గెలను కోసి ఇంట్లోకి తీసుకువచ్చింది. ఆ సమయంలో అరటి గెలలో పాము ఉన్న విషయాన్ని బాలుడు గమనించి తల్లికి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు పరిశీలించగా, పక్కనే ఉన్న బట్టల బుట్టలో విషపూరితమైన కట్లపాము కనిపించింది. దీంతో అప్రమత్తమైన బాలుడి పెదనాన్న వెంకటేష్ ఆ పామును కొట్టి చంపాడు. అయితే, అప్పటికే పాము బాలుడిని కాటేసిన సంగతి కుటుంబ సభ్యులు గుర్తించలేకపోయారు. శనివారం రాత్రి వరకు బాలుడు సాధారణంగానే ఉండటంతో ఎవరూ అనుమానించలేదు. ఆదివారం ఉదయం బాలుడి నోటి నుంచి నురగలు రావడంతో పాటు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తీవ్ర ఆందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే గౌరీదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు కళ్లముందే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కలచివేశాయి. బాలుడి అకాల మృతితో చింతలచెరువు గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

## తంటికొండ ఆలయ పునర్నిర్మాణానికి రూ.6 కోట్ల టీటీడీ గ్రాంట్



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) సెప్టెంబర్ 20:** తంటికొండ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.6 కోట్ల టీటీడీ గ్రాంట్ మంజూరుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారి కృషి ఎంతో కీలకమని ఆలయ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారి ఆధ్వర్యంలో టీటీడీ ఈఓ ముద్దాడ రవిచంద్ర గారిని కలిసి, రూ.6 కోట్ల గ్రాంట్‌కు సంబంధించిన రూ.30 లక్షల మ్యాచింగ్ ఫండ్ చెక్కును దాత దాసరి సీతారాం గారి చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా తంటికొండ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి టీటీడీ ద్వారా నిత్య అన్నదానం అందించే విషయంపై కూడా ఈఓ రవిచంద్ర గారితో చర్చించారు. ఈ సందర్భంగా తంటికొండ ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ కార్యక్రమాల గురించి ఈఓ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారు చేస్తున్న కృషికి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అచ్చన్నదొర తెలిపారు.

ఇట్లు
బద్దిరెడ్డి అచ్చన్నదొర
చైర్మన్, తంటికొండ శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం

## హ్యూమన్ రైట్స్ వాచ్ జిల్లా సెక్రటరీగా మచ్చ వినయ్ ప్రసాద్

**ఏజెన్సీలో మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తా...... వినయ్ మచ్చ.....**



**కూనవరం సెప్టెంబర్ 20. ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా హ్యూమన్ రైట్స్ వాచ్ జిల్లా సెక్రటరీగా కూనవరం మండలానికి చెందిన మచ్చ వినయ్ ప్రసాద్ నియమితులయ్యారు. హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ బాలు అక్కిస ఆదివారం వినయ్ ప్రసాద్‌ను జిల్లా సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అవసరమైన న్యాయ సలహాలు అందించడంతో పాటు, చట్టాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేలా సంస్థ తరఫున కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తానని వినయ్ ప్రసాద్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా సెక్రటరీగా బాధ్యతలు అప్పగించిన హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ బాలు అక్కిసకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మడికి, చిలకలపాడు గ్రామం నందు జరిగిన గణపతి హోమం,అన్న సమారాధనలో పాల్గొన్న యువ నాయకులు బండారు సంజీవ్.



**ఆలమూరు సెప్టెంబర్ 20(ప్రజాజ్యోతి):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సందర్భముగా ఆలమూరు మండలం మడికి,చిలకలపాడు గ్రామం నందు ఆదివారం జరిగిన గణపతి హోమం మరియు అన్న సమారాధన కార్యక్రమాల్లో పాల్గొన్న యువ నాయకులు బండారు సంజీవ్.ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెముడులంక ఎస్సీ కాలనీలో 3 నెలలుగా డ్రైనేజీ సమస్య.



**ఆలమూరు సెప్టెంబర్ 20(ప్రజాజ్యోతి):** ఆలమూరు మండలం చెముడులంక గ్రామం ఎస్సీ కాలనీ చర్చి వీధిలో గత 3 నెలలుగా డ్రైనేజీ సమస్య తో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని, మురుగు కాలువలు పూడుకుపోయాయని స్థానికులు తెలిపారు.మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వస్తుండటంతో కాలనీలో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. అధికారులు దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.ఈ సమస్య పై పంచాయతీ అధికారులకు వినతిపత్రం ఇచ్చియున్నామని బిఎస్పీ కొత్తపేట నియోజకవర్గం అధ్యక్షులు గుర్రపు కొత్తియ్య అన్నారు.

## ప్రభుత్వ రాయితీపైఉలవ విత్తనాల పంపిణీ




**వీరబల్లి సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి** కడప జిల్లా వీరబల్లి మండలం, మట్లి రైతు సేవా కేంద్రం నందు 80% ప్రభుత్వ రాయితీపై రైతులకు అందించే ఉలవ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ నాగార్జున ఆచారి తదితర నాయకులు, అధికారులు ప్రారంభించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల నందు రేపటి నుంచి ప్రభుత్వ రాయితీపై ఉలవ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి శ్రీమతి స్వాతి తెలిపారు. వర్షాభావ పరిస్థితులలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలో భాగంగా వీరబల్లి మండలానికి 200 క్వింటాళ్ల ఉలవ విత్తనాలు కేటాయించబడ్డాయని, రైతు సోదరులు వారి యొక్క గ్రామ రైతు సేవా కేంద్రానికి ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, సెల్ ఫోన్ తీసుకెళ్లి ఉలవ విత్తనాలను పొందవచ్చన్నారు.ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సబ్సిడీ ద్వారా తీసుకున్న ఉలవ విత్తనాలను తప్పనిసరిగా సాగు చేసి ప్రయోజనం పొందాలన్నారు.ఉలవ విత్తనాల మొత్తం ధర క్వింటాలుకు 7,400/- కాగా, ప్రభుత్వం అందించేరాయితీ ?5,920/- పోనూ రైతు సోదరులు క్వింటాలుకు కేవలం 1,480/- మాత్రమే చెల్లించాలన్నారు.

## వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు

**శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో రాయచోటి పట్టణం మహబూబ్‌నగర్ వాసుల చేరిక**



**రాయచోటి సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి** రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు సాహిత్య థియేటర్ వెనుక ఉన్న మహబూబ్‌నగర్‌లో 50 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. అహమ్మద్, రియాజ్‌లతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో నూతనంగా చేరిన వారిని శ్రీకాంత్‌రెడ్డి ఆత్మీయంగా స్వాగతించారు. వైఎస్సార్‌సీపీలో ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, విలువ, గుర్తింపు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో పెద్ద సంఖ్యలో కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడంతో స్థానికంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. శ్రీకాంత్ రెడ్డికి ఆత్మీయ స్వాగతంమహబూబ్ నగర్ కు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి స్థానిక ప్రజలు, యువత ఆత్మీయ స్వాగతం పలికారు. యువతకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, పట్టణ కన్వీనర్ నవాజ్, మైనారిటీ రాష్ట్ర కార్యదర్సులు జాఫర్ అలీ ఖాన్, షబ్బీర్, నాయకులు సుగవాసి శ్యామ్,అబూ బకర్,రైతు మిత్ర ఖాదర్ బాష తదితర నాయకులు పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో రంగిన్ వలీ,యాసిన్, మస్తాన్,అల్లా బక్ష్,నజీర్,జాగీర్, ఆయూబ్ తదితరులు ఉన్నారు

## పూసల కాలనీ నివాసితుల కు తాగు నీరు ఇవ్వండి





**సెప్టెంబర్ 20 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జీ శ్రీనివాస్ నాయుడు :-** గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారికి గౌరవనీయులైన నియోజకవర్గ ఎమ్మెల్యే గారికి గౌరవనీయులైన మండల రెవెన్యూ అధికారి గారు స్థానిక ఎంపీటీసీ మరియు పంచాయతీ కార్యదర్శి గారు బుక్కరాయసముద్రం మండలం విషయం: పూసల కాలనీలో గత 20 రోజులుగా తాగునీటి సమస్య – ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని విన్నపం.మేము బుక్కరాయసముద్రం మండల పరిధిలోని పూసల కాలనీ నివాసితులము. గత 20 రోజులుగా మా కాలనీ వీధి కుళాయిలకు అసలు నీరు రావడం లేదు. మా కాలనీలో వాడుకోవడానికి ఎలాంటి బోరు సదుపాయం కూడా అందుబాటులో లేదు. నీరు లేక ఇక్కడి పూసల కాలనీవాసులు, ప్రజలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కావున, దయచేసి మా పరిస్థితిని గమనించి, మా కాలనీకి తక్షణమే తాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి మమ్మల్ని ఆదుకోవాలని పూసల కాలనీవాసులమంతా వినయపూర్వకంగా కోరుకుంటున్నాము అని పూసల కాలనీ నివాసితులు పూసల సంఘానికి జిల్లా అధ్యక్షులు పూసల హనుమంతు తెలిపారు.

## వైసీపీ నుండి టిడిపి లో చేరిన చొప్పెల్ల గ్రామ మాజీ సర్పంచ్ కుమారుడు తోరాటి సూర్యప్రకాష్.



**ఆలమూరు సెప్టెంబర్ 20(ప్రజాజ్యోతి):** కూటమి ప్రభుత్వం చేసే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఎంతో నచ్చి మెచ్చి ఆదివారం కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామం నుండి వైయస్సార్సీపి మాజీ సర్పంచ్, సీనియర్ రాజకీయ నాయకుడు తోరాటి భద్రరావు చిన్న కుమారుడు తోరాటి సూర్యప్రకాష్ తెలుగుదేశం పార్టీలో టిడిపి నాయకులు సమక్షంలో జాయిన్ అవ్వడం జరిగింది.టిడిపి నాయకులు సూర్యప్రకాష్ కి పార్టీ కండువా కప్పి అభినందించారు.ఈ కార్యక్రమంలో టిడిపి చొప్పెల్ల గ్రామ క్లస్టర్ ఇన్చార్జ్ బళ్ల హరికృష్ణ, టిడిపి సీనియర్ నాయకుడు సకుమళ్ళ రాముడు, టిడిపి చొప్పెల్ల గ్రామ కమిటీ ప్రెసిడెంట్ మద్ది సతీష్, సుంకర రాజు, ఆకుల గోపి తదితరులు పాల్గొన్నారు.

## వంకవారిగూడెం గణనాధుని ఊరేగింపు



**జీలుగుమిల్లి : 20 సెప్టెంబర్ జీలుగుమిల్లి : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** జీలుగుమిల్లి మండలం వంకా వారి గూడెం గ్రామపంచాయతీ వాడపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవ వేడుకలు అంగరంగ వైభవంగ జరుపుకుని ఆదివారం రోజున వినాయకుని యొక్క లడ్డు ప్రసాదాన్ని వేలం పాటలో గణేష్ యూత్ వారు 11,200/-రూపాయలకు దక్కించుకున్నారు. ఈరోజున వినాయకుని యొక్క నిమజ్జనం మహోత్సవం డీజే పాటలతో గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలతో బర్రింకలపాడు చెరువు నందు నిమజ్జనం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోష రావు, ఆర్ ఎస్ ఎస్ వేదుల జనార్దన్ రావు,డాక్టర్ దిలీప్ సాయి,చందు,నరేంద్ర, పూణెం ప్రసాద్, నాగరాజు,నూనె దుర్గాప్రసాద్, తా మా నవీన్, చైతన్య,గ్రామ యువకులు మహిళలు గ్రామ పెద్దలు అందరూ పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని సన్నిధిలో డాక్టర్ నరసింహారెడ్డి దంపతులు

**పురుషోత్తపట్నంలో ఘనంగా కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు**





**ఎటపాక, సెప్టెంబర్ 20 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్‌లో శ్రీ సీతారామ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భద్రాచలం పద్మావతి హాస్పిటల్ అధినేత, రోటరీ రివర్‌సైడ్ ప్రెసిడెంట్ డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ సుకన్యారెడ్డి దంపతులు విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజలు నిర్వహించి, ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను డాక్టర్ నరసింహారెడ్డి దంపతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గొంగడి వెంకట రామిరెడ్డి, సారెడ్డి శ్రీనివాసరెడ్డి, దొడ్డపనేని శ్రీహరి, మోర్తాల సుధాకర్ రెడ్డి, పుట్టి అప్పారావు, గోగిరెడ్డి రాజు, చందా చంద్రశేఖర్ రెడ్డి, చింతలపూడి భాస్కర్ రెడ్డి, సజ్జ సుధీర్, సజ్జ రాంప్రసాద్, చేకూరి సత్యనారాయణ, మోర్తాల రామిరెడ్డి, కుంట సాంబిరెడ్డి, మల్లు శేఖర్ రెడ్డి, భోగాల రంగారెడ్డి, గడేసుల నవీన్, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, టీచర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యదర్శిగా సురేష్‌బాబు

**అధ్యక్షుడిగా ఆరోసారి బొప్పరాజు ప్రధాన కార్యదర్శిగా మూడోసారి కృష్ణమూర్తి**




**బాపట్ల సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ 18వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆరోసారి, ప్రధాన కార్యదర్శిగా చేబ్రోలు కృష్ణమూర్తి మూడోసారి ఎన్నికయ్యారు. బాపట్ల జిల్లా ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు సీహెచ్. సురేష్‌బాబు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు.రెవెన్యూ ఉద్యోగుల హక్కులు, పదోన్నతులు, ఖాళీల భర్తీ, సర్వీసు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సురేష్‌బాబు తెలిపారు. అర్హులైన వీఆర్వోలకు పదోన్నతులు, వీఆర్ఏల వేతనం పెంపు, ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గింపుపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన రెవెన్యూ సేవలు అందించేందు కు ప్రభుత్వానికి సహకరిస్తామని పేర్కొన్నారు.

# వినాయక చవితి వేడుకలలో బుధవారపు వీధి యూత్ అన్నదానం.



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 20.** పాలకొల్లులో బుధవారపు వీధి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకలలో ఆదివారం యూత్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకురాలు రావూరి సుధ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా రావూరి సుధ మాట్లాడుతూ, వినాయక చవితి వేడుకల సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాల వలన సమాజంలో ఐక్యత, సేవాభావం మరింత పెంపొందుతుందని పేర్కొన్నారు. యువత ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం బుధవారపు వీధి యూత్ స్నేహితులు భవాని గ్రూపు సభ్యులు రావూరి సుధను ఘనంగా సత్కరించి, మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంకిరెడ్డి శీను, రంకిరెడ్డి బుజ్జి, హేమచందర్, గుర్రం శీను, పోతినీడి నాని,గజ్జరపు సురేష్, రేలంగి శీను, కోపెల్ల ప్రకాష్ , ఇంటి చిదంబరం, మద్దుల మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగుంటలో ఘనంగా అన్నదానం గణనాథునికి ప్రత్యేక పూజలు

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

**దాతల సేవాభావాన్ని అభినందించిన గ్రామస్తులు**



**ఎటపాక, సెప్టెంబర్ 20 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక మండలం చోడవరం పంచాయతీ పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో గణపతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉత్స వాల్లో భాగంగా గ్రామంలో కొలువు దీరిన శ్రీ వినాయక స్వామివారికి స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు, గ్రామస్తుల కోసం దాతల సొంత ఖర్చులతో ఘనంగా అన్నదాన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఎర్రగుంట తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి చోడవరం మాజీ సర్పంచ్ పోడియం మన్ని, పోడియం సత్యనారాయణ, పోడియం నాగేశ్వరావు, పోడియం రాములమ్మ దాతలుగా వ్యవహరించారు. గణనాథుని సేవలో భాగస్వాములై తమ ఉదారతను చాటుకున్న దాతలను గ్రామస్తులు అభినందించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు.

# నేడు పీజీఆర్ఎస్ ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

**పరిష్కారం కాని ఫిర్యాదుల వివరాలకు 1100కు కాల్ చేయొచ్చు**



**బాపట్ల సెప్టెంబరు 20 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వాసుదేవ తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు గతంలో అందిన అర్జీల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించి, 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి కొత్త అర్జీలను స్వీకరిస్తామని పేర్కొన్నారు.పరిష్కారం కాని పాత ఫిర్యాదుల స్థితిగతులు తెలుసుకోవడానికి 1100కు కాల్ చేయవచ్చని తెలిపారు. అలాగే మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ ద్వారా కూడా అర్జీలు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# నీరు కనిపిస్తే వరి వాతావరణం మారితే అప్పులే

**ఎల్‌నినో ముప్పు వేళ అన్నదాతకు సాగు సవాల్, ముందస్తు అవగాహనతోనే పంటకు భరోసా**

**పంట వేయొద్దు అని చెప్పడం కాదు.ఏ పంట వేయాలి, ఎప్పుడు వేయాలి, అన్నదానిపై గ్రామస్థాయిలో అవగాహన అవసరం**





**బాపట్ల సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**దపొలంలో నీరు కనిపిస్తే రైతు మనసులో మొదట మెదిలేది ఒక్కటే,ఇప్పుడే పంట వేసుకుంటే ఈ నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. వర్షాలు పడుతున్నాయి కాలువల్లో నీరు ప్రవహిస్తోంది. ప్రాజెక్టులు చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి పొలం సాగుకు అనుకూలంగా కనిపిస్తోంది దీంతో అన్నదాత వరి సాగువైపు అడుగులు వేస్తున్నాడు. ఇది అతని అలవాటు మాత్రమే కాదు. తరతరాలుగా తనకు తెలిసిన వృత్తి జీవన విధానం. కుటుంబాన్ని నడిపించే ఆధారం.అయితే ఈరోజు పొలంలో కనిపిస్తున్న నీరు. పంట కోత వరకు ఉంటుందా అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, నీటి వనరుల్లో ఉన్న నిల్వలను చూసి పంట వేసిన రైతు. రేపటి వాతావరణ పరిస్థితులు మారితే ఏం చేయాలి వర్షం అవసరమైన సమయంలో రాకపోతే అధిక వర్షం, వస్తే ఉష్ణోగ్రతలు, పెరిగితే సాగునీటి లభ్యత, తగ్గితే అనే ప్రశ్నలకు ముందుగానే సమాధానాలు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది.ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు కూడా రైతులను అప్రమత్తం చేస్తున్నాయి. అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలన సంస్థ (ఎన్ఓఏఏ)సెప్టెంబరు 10న విడుదల చేసిన తాజా (ఈఎన్ఎస్ఓ) నివేదిక ప్రకారం ఎల్‌నినో బలపడుతోంది. 2026 అక్టోబర్,డిసెంబరు కాలంలో చాలా బలమైన ఎల్‌నినో పరిస్థితులకు అధిక అవకాశం ఉందని పేర్కొంది. అయితే ఎల్‌నినో ప్రభావాలు ప్రతి ప్రాంతంలో ఒకే విధంగా ఉంటాయని కాదు, స్థానిక వాతావరణ పరిస్థితుల ఆధారంగా మారవచ్చని అదే నివేదిక స్పష్టం చేస్తోంది.

**ఇప్పుడున్న నీటిని చూసి. ముందున్న కాలాన్ని మర్చిపోవద్దు**

రైతు పరిస్థితి ఇక్కడే సంక్లిష్టంగా మారుతోంది. ఒకవైపు ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు కాలువలు, చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు కనిపిస్తోంది. దీంతో ఇంత నీరు ఉన్నప్పుడు వరి ఎందుకు వేయకూడదు, అన్న ఆలోచన రైతులో రావడం సహజం.రైతుకు వరి కొత్త పంట కాదు. భూమిని దున్నడం నుంచి నారు పెంచడం, నాట్లు వేయడం, కలుపు తీయడం, ఎరువులు వేయడం, కోత వరకు అతనికి తెలిసిన సాగు విధానం అదే. ప్రత్యామ్నాయ పంట వేసి మార్కెట్‌లో పరిస్థితి ఎలా ఉంటుందో తెలియకపోవడం, కొనుగోలు ఉంటుందో లేదో అన్న అనుమానం ఉండటం, వరి పంటకు సంబంధించిన అనుభవం ఉండటం వంటి కారణాలతో చాలామంది రైతులు మళ్లీ వరి వైపే మొగ్గుచూపుతున్నారు.అందుకే రైతును కేవలం వరి వేయొద్దు అని చెప్పడం సమస్యకు పరిష్కారం కాదు.దానికి బదులు,మీ భూమికి ఏ పంట సరిపోతుంది అందుబాటులో ఉన్న నీటితో ఏ పంటను ఎంతకాలం సాగు చేయగలరు, వాతావరణం మారితే ఏ ప్రత్యామ్నాయం ఉంది, మార్కెట్‌లో ఏ పంటకు డిమాండ్ ఉంది, అనే సమాచారాన్ని రైతు చేతిలో పెట్టాలి.

**ఆకాశం వైపు చూస్తున్న అన్నదాత**

వరి పొలంలో నాట్లు వేసిన తర్వాత రైతు కళ్లంతా ఆకాశం పైనే. చిన్న వర్షం పడినా వాతావరణం ఎలా మారుతుందోనని ఆలోచన. వర్షం ఆగిపోయినా ఆందోళనే. అధిక వర్షం వచ్చినా ఆందోళనే. ఎందుకంటే పంటలో పెట్టిన విత్తనం, ఎరువు, కూలీల ఖర్చు, సాగునీటి ఖర్చు,అన్నీ రైతు పెట్టుబడే. పంట చేతికొస్తే కుటుంబానికి ఆదాయం. పంట దెబ్బతింటే మాత్రం అదే రైతుకు అప్పుగా మిగిలే అవకాశం ఉంది.ఇదే రైతు జీవితంలోని అసలు విషాదం. భూమిని పండించడం అతనికి ఉద్యోగం. వ్యవసాయమే అతని ఉపాధి. అందుకే నీరు కనిపిస్తే పంట వేయకుండా ఉండలేడు. కానీ వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో రైతు చేతిలో ఉండదు.

**ఈ ఏడాది పరిస్థితులు మరింత అప్రమత్తత కోరుతున్నాయా**

భారత వాతావరణ విభాగం 2026 నైరుతి రుతుపవన కాలానికి దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉండే అవకాశాన్ని మే నెలలో అంచనా వేసింది. దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉండే అవకాశం ఉందని ఆ సమయంలో పేర్కొంది అయితే ప్రస్తుతం పరిస్థితి మరో కోణాన్ని చూపుతోంది. సెప్టెంబరు 19న కోస్తాంధ్రకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలను (ఐఎండి) జారీ చేసింది. సెప్టెంబరు 22, 23 తేదీల్లో అతి భారీ వర్షాల అవకాశం, అనంతరం కూడా వర్షాలు కొనసాగే సూచనలు ఇచ్చింది. ఇది రైతుకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది,వర్షపాతం ఒకే విధంగా ఉండకపోవచ్చు. ఒక సమయంలో అధిక వర్షం. మరో సమయంలో వర్షాభావ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు పంటల ఎంపిక, నీటి వినియోగం, సాగు సమయం విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.

**వరి మాత్రమే ఎందుకు, ప్రత్యామ్నాయాలపై గ్రామస్థాయిలో చర్చ ఏది**

ప్రత్యామ్నాయ పంటల గురించి రైతుకు చెప్పడం ఒక్కరోజు కార్యక్రమంతో పూర్తయ్యేది కాదు. పంట వేసే ముందు నుంచే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.రైతుకు కేవలం పంట పేరు చెప్పడం సరిపోదు.పంటకు ఎంత నీరు అవసరం.ఎన్ని రోజుల్లో చేతికి వస్తుంది.ఎంత పెట్టుబడి అవసరం.మార్కెట్ ఎక్కడ ఉంది.కొనుగోలు చేసే సంస్థలు ఎవరు.వాతావరణం ప్రతికూలిస్తే నష్టం ఎంత.ప్రభుత్వ పథకాలు ఏవి అందుబాటులో ఉన్నాయి.ఇలాంటి పూర్తి సమాచారాన్ని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది గ్రామస్థాయిలో రైతులకు వివరించాల్సిన అవసరం ఉంది.

**వరి వేయొద్దు అనే హెచ్చరిక కంటే.పంట ప్రణాళిక' అవసరం**

రైతు వరి వేస్తున్నాడని తప్పుబట్టడం సులభం. కానీ అతని పరిస్థితిని అర్థం చేసుకోవడం ముఖ్యం. తనకు తెలిసిన పంటను, తనకు అందుబాటులో ఉన్న నీటితో, తన కుటుంబ అవసరాల కోసం పండించాలనుకోవడం రైతు సహజ నిర్ణయం.కాబట్టి ప్రభుత్వ వ్యవస్థలు కూడా రైతు నిర్ణయాన్ని కేవలం మార్చాలని చూడకుండా, సమాచారంతో ఆ నిర్ణయాన్ని బలపరచాలి.గ్రామంలో వర్షపాతం అంచనాలు, చెరువులు,కాలువల్లో నీటి లభ్యత, ప్రాజెక్టుల నిల్వలు, రాబోయే వారాల వాతావరణ పరిస్థితులు, పంటల వారీగా,సాగు సూచనలు వంటి వివరాలను సులభమైన భాషలో రైతులకు చేరవేయాలి. అప్పుడే రైతు నీరు ఉంది కాబట్టి పంట వేద్దాం అనే నిర్ణయం నుంచి పంట పూర్తయ్యే వరకు నీరు, వాతావరణం, మార్కెట్ ఎలా ఉంటాయి అనే ఆలోచనకు మారే అవకాశం ఉంటుంది.

**గ్రామానికి ఒక పంట ప్రణాళిక ఉండాలి**

ప్రతి గ్రామంలో పంటల సాగుకు ముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయి పంట ప్రణాళిక సమావేశాలు నిర్వహిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆ గ్రామంలో అందుబాటులో ఉన్న నీరు ఎంత, ఎంత భూమిలో వరి సాగు చేయవచ్చు, మిగిలిన భూముల్లో ఏ ప్రత్యామ్నాయ పంటలు వేయవచ్చు, వాతావరణ సూచనల ఆధారంగా ఏ జాగ్రత్తలు తీసుకోవాలి, అనే అంశాలపై ముందుగానే చర్చ జరగాలి.ఇది రైతును వరి సాగు నుంచి దూరం చేయడం కోసం కాదు. రైతు పెట్టుబడి పెట్టిన పంటను సురక్షితంగా ఇంటికి చేర్చే అవకాశం పెంచడం కోసం.

**రైతు కష్టం వాతావరణం చేతిలో బందీ కాకూడదు**

ఒక రైతు పొలంలో పచ్చగా కనిపిస్తున్న ప్రతి మొక్క వెనుక ఒక కుటుంబం ఉంటుంది. ఆ పచ్చదనం వెనుక అప్పు ఉండొచ్చు. కష్టార్జితం ఉండొచ్చు. పిల్లల చదువు ఉండొచ్చు. ఇంటి అవసరాలు ఉండొచ్చు. భవిష్యత్తుపై ఆశ ఉండొచ్చు. అందుకే వాతావరణ మార్పుల సమయంలో రైతుకు కావాల్సింది భయం కాదు,భరోసా.అనుమానం కాదు, ముందస్తు సమాచారం.కేవలం హెచ్చరిక కాదు ప్రత్యామ్నాయం.నీరు కనిపిస్తే వరి వేసే రైతు తప్పు చేశాడని చెప్పడం కంటే. నీరు ఉన్నప్పుడే రేపటి నీటి పరిస్థితిని కూడా అంచనా వేసుకునేలా రైతుకు సమాచారం అందించడమే అసలు వ్యవసాయ విధానం కావాలి.ఎల్‌నినో పరిస్థితులు బలపడుతున్న సమయంలోనూ, ప్రస్తుతం కోస్తాంధ్రలో వర్షాలకు హెచ్చరికలు కొనసాగుతున్న సమయంలోనూ, రైతుకు ప్రస్తుత వాతావరణం తో పాటు రేపటి సాగు ప్రణాళిక అందించడం అత్యవసరం. ఎల్‌నినో వల్ల తప్పనిసరిగా ఒక నిర్దిష్ట ప్రాంతంలో పంట నష్టం జరుగుతుందని చెప్పడం శాస్త్రీయంగా సరైంది కాదు, కానీ వాతావరణ అనిశ్చితి పెరిగినప్పుడు ముందస్తు వ్యవసాయ ప్రణాళిక మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది.

**చివరికి రైతు కోరేది ఒక్కటే**

నా పంటను కాపాడుకునేంత సమాచారం ముందే ఇవ్వండి. పంట దెబ్బతిన్న తర్వాత సాయం కోసం ఎదురుచూసే పరిస్థితి రాకుండా చూడండి. ఇది రైతును వరి నుంచి దూరం చేసే కథ కాదు.రైతు వేసిన ప్రతి విత్తనం వెనుక ఉన్న కష్టాన్ని కాపాడే కథ.

# గుంతకల్లు రైల్వే స్టేషన్ బయట అందాలు లోన రంధ్రాలు

**చినుకు పడితే ప్లాట్ఫారాలు చిత్తడే**

**వర్షపు నీరుకు ఎక్కడ కాలుజారి పడతామో అని ప్రయాణికులు భయాందోళన**







**గుంతకల్లు సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి):** భారతీయ రైల్వే దేశంలోని ప్రధాన రైల్వే స్టేషన్లను సుందరంగా తీర్చిదిద్దారు. అందులో భాగంగానే గుంతకల్లు రైల్వే స్టేషన్ ఎయిర్పోర్టుల తలపించేలా తీర్చిదిద్దారు. కానీ బయటకు మాత్రం అందాలు లోపల మాత్రం రంధ్రాలుగా గుంతకల్లు రైల్వే స్టేషన్ మారింది. చినుకు పడితే ప్లాట్ఫారాలు చిత్తడే అనే చందాగా ఉంది. గుంతకల్లు జంక్షన్ రైల్వే స్టేషను దక్షిణ కోస్ట్ రైల్వే లోని గుంతకల్లు రైల్వే డివిజను యొక్క ప్రధాన కార్యాలయం పరిధిలో పనిచేస్తుంది. ఇది ముంబై-చెన్నై రైలు మార్గము, గుంతకల్లు-చెన్నై రైలు మార్గము, గుంతకల్లు- సోలాపూర్ రైలు మార్గము, గుంతకల్లు- బెంగళూరు రైలు మార్గము, గుంతకల్లు- వాస్కో డా గామా రైలు మార్గము, గుంతకల్లు- విజయవాడ రైలు మార్గములకు ఒక కూడలి స్టేషను ఇక్కడ ఉంది. కోట్లు ఖర్చు చేసి ఎయిర్పోర్టుల తీర్చిదిద్దిన గుంతకల్లు రైల్వే స్టేషన్ శనివారం రాత్రి గుంతకల్లులో కురిసిన వర్షానికి గుంతకల్లు రైల్వే స్టేషన్ లో రంధ్రాల వెంబడి, పైపుల్లో వర్షపు నీరు కారుతూ ప్లాట్ఫారాలు చిత్తడిగా మారడంతో, రైలు ఎక్కే, దిగే ప్రయాణికులు ఎక్కడ కాలుజారి పడతామో అని భయంతో ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఎక్స్కలేటర్ మరియు మెట్లు మార్గంలో వర్షపు నీరు పడుతూ నిలబడడంతో ప్రయాణికు లు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే వెయిటింగ్ హాలు ముందర, క్యాంటీన్ ముందర వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు వెయిటింగ్ హాలుకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్ని కోట్లు ఖర్చు పెట్టి చేసిన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదని, బయట అందాలుగా లోపల రంధ్రాలుగా గుంతకల్లు రైల్వే స్టేషన్ ఉందని ప్రయాణికులకు అనుకుంటున్నారు. కనీసం రైల్వే ఉన్నంత అధికారులు స్పందించి వర్షం వస్తే ప్లాట్ఫారాల్లోకి వర్షపునీరు రాకుండా తగిన మరమ్మత్తులు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లు కలగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



# చొప్పెల్ల గవర్నమెంట్ ఆసుపత్రి వెనుక వీధిలో బాల గణపతి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన సరస్వతి పూజ



**ఆలమూరు సెప్టెంబర్ 20(ప్రజాజ్యోతి):**ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలోని గవర్నమెంట్ ఆసుపత్రి వెనుక వీధిలో బాల గణపతి కమిటీ ఆధ్వర్యములో వినాయకచవితి వేడుకలలో భాగంగా శనివారం రాత్రి అత్యంత ఘనంగా సరస్వతి పూజ నిర్వహించారు.ఆలయ ప్రధాన పూజారులు యలమంచిలి రాజశేఖర్, బుచ్చిరాజు సోదరుల ఆధ్వర్యములో వేద మంత్రోచ్చారణలతో గణనాధుడికి విశేష పూజలు, సరస్వతి పూజ జరిపించారు.ఇక్కడ జరిగిన సరస్వతి పూజలో సుమారు 70 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని పురోహితులు చెప్పినట్లు అత్యంత భక్తి శ్రద్ధలతో సరస్వతి పూజ చేసినారు. సరస్వతి పూజ చేయించుకున్న విద్యార్థిని విద్యార్థులందరికి యర్రంశెట్టి మణి, అయ్యల మణి బుక్స్,సాపిరెడ్డి సుబ్రహ్మణ్యం కుమారుడు వీర మురళి సాయి పెన్స్, పెన్సిల్స్,పోతుల వెంకటేశ్వరరావు మనవరాలు జ్ఞాన శ్రీజ మనవడు కార్తీక్ స్పెషల్ కిట్ ఇచ్చినారు.అలాగే యర్రంశెట్టి మణి, అయ్యల మణి,మీసాల వెంకటేశ్వరరావు మనవరాళ్లు రమ్య, భవ్య డ్రింక్స్ ఇచ్చినారు.సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులందరికి బుక్స్, పెన్స్, పెన్సిల్స్, డ్రింక్స్ ఇచ్చిన దాతలను బాల గణపతి కమిటీ సభ్యులు అభినందించారు. అలాగే సరస్వతి పూజలో పాల్గొన్న వారికి కమిటీ వారు దాతల సహకారంతో ప్రసాదం పెట్టినారు.ఇక్కడ గణపతి నవరాత్రులు ఉత్సవాలు జరపడం ఇది ఇరవై అయిదవ సంవత్సరం అని, ఈ సంవత్సరం దాతల సహాయ సహకారాలతో అత్యంత ఘనంగా ఈ వచ్చే శనివారం(26.9.2026 న) అన్నసంతర్పణ చేయడానికి నిర్ణయించామని,ఈ నెల 30 న బుధవారం నిమజ్జన ఊరేగింపు ఉంటుందని బాల గణపతి కమిటీ సభ్యులు తెలియజేసారు.

## భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజా కార్యక్రమం



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పొందూరు మండలం తోలాపి గ్రామంలో దేవాంగుల కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి మండపం వద్ద భక్తిశ్రద్ధలతో ఘనంగా కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పురోహితుల వేద మంత్రోర్చనలతో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. మహిళలు , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం గం గణపతియే నమః అని స్వామివారి నామస్మరణ తో ఆ ప్రాంగణం మారుమ్రోగింది. ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

## సరస్వతి పల్లి లో ఘనంగా వినాయక నిమజ్జనం



**రామాపురం సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి** రామాపురం మండలంలోని సరస్వతిపల్లి గ్రామ పరిధిలోఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నిమజ్జన ఊరేగింపు ఆదివారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. చెన్నూరు బాబు ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట నిర్వహించగా, దేగ పెంచలయ్య రూ.75వేల రూపాయలు కు లడ్డూనుదక్కించుకున్నారు.అలాగే చెరుకులను చెన్నూరు వెంకట శివయ్య, చెన్నూరు లక్ష్మీనారాయణ 20 వేలు రూపాయలు కు మరియు కలశం చెంబు ను పగడాల జ్యోతి పగడాల సాయికుమార్ 11 వేల రూపాయలు కు , కండువాలను చెన్నూరు పిచ్చయ్య చిన్న వెంకట నరసింహులు 6 వేల రూపాయలు కుదక్కించుకున్నారు.అనంతరం గ్రామ ప్రజలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మేళతాళాల నడుమ వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తుల సందడితో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

## ఘనంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ పుట్టినరోజు



గుంతకల్లు సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి): పోరాటయోధుడు, పోరాటాల నుండి ప్రజలకు పరిచయమైన నాయకుడు, ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు, పెత్తందారి వ్యవస్థ పై యుద్ధం చేసిన గొప్ప నాయకుడునీ వక్తులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయం లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి జగదీష్ 70వ పుట్టినరోజు ఘనంగా సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వక్తులు మాట్లాడుతూ ఎక్కడ సమస్యలు ఉంటే అక్కడ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ప్రజల్లో అవగాహన తీసుకొస్తూ ప్రజలకు కనువిప్పు కలిగిస్తూ పాలకులకు మనం బానిసలు కాదంటూ ఓట్లు వేయించుకున్న పాలకులే మనకు బానిసలుగా పని చేయాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ప్రజలకు సమస్యలపై పోరాటం చేసే ఉద్యమ స్ఫూర్తి నింపిన నాయకుడు జగదీష్ అని కొనియాడారు.ప్రత్యేక హోదా, హంద్రీనీవా, కూడు గూడు అనే భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాన్ని పేద మధ్య బడుగు బలహీన అనుగరిన వర్గాల ప్రజలకు నిజం చేసిన నాయకుడు, ఎంతోమంది యువకులను తీర్చిదిద్ది రాజకీయంగా జీవితం ఇచ్చిన వ్యక్తి,కార్మిక కర్షక రైతు రాజుగా ఉండాలనే డ్రుడ సంకల్పంతో రైతాంగ సమస్యల పట్ల ప్రజా సమస్యల పట్ల నిరంతరం అలుపెరగని పోరాటాలు చేస్తూ ఎంతోమంది యువకులకు ఆదర్శంగా నిలిచిన గొప్ప నాయకుడు డి జగదీష్ ని అన్నారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఎప్పుడు ఆయురారోగ్యాల తో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవితాన్ని గడపాలని అన్నారు. నాయకులు కార్యకర్తలు ముందుగా కేక్ కట్ చేసి స్వీట్స్ తినిపించుకున్నారు. ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి గోవిందు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరభద్రస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, రూరల్ కార్యదర్శి రాము రాయల్, సాయి కార్యదర్శి రామాంజనేయు లు యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు కొండయ్య, బసిరెడ్డి, కిషోర్ ,మైనార్టీ నాయకులు గడ్డం భాష ,సిపిఐ నాయకులు గురుస్వామి, నాగరాజు, అశోక్ ,ట్రాన్స్పోర్ట్ హమాలీలు, మున్సిపాలిటీ యూనియన్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్





**కూనవరం సెప్టెంబర్ 20. ప్రజా జ్యోతి** కూనవరం మండలంలోఇటీవల మృతి చెందిన సీపీఎం పార్టీ కూనవరం మండల కమిటీ సభ్యులు కర్నాటి శ్రీనివాసరావు కుటుంబాన్ని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ.. కర్నాటి శ్రీనివాసరావు పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించిన కార్యకర్తగా గుర్తింపు పొందారని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తరించడంలో, ప్రజలను సమీకరించడంలో శ్రీనివాసరావు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు.జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య మాట్లాడుతూ శ్రీనివాసరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి, కార్యకర్తలతో కలిసిమెలిసి పని చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, విషాద సమయంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది రవితేజ, తాళ్లూరి శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య, జోడే రాజు, గ్రామ శాఖ సభ్యులు కర్నాటి వెంకటరామారావు, అరవ శ్రీనివాసరావు, నారాయణరావు, రవీంద్ర, సీపీఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని, అభివృద్ధి చేసేందుకు కష్టపడి నిధులు తీసుకువస్తున్నా.

**జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 20.** పాలకొల్లు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేటందుకు అన్నివిధాలా కష్టపడి నిధులు తీసుకువస్తున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులోని పలు వార్డులలో ఆదివారం ఒకే రోజున రూ 3.79 కోట్లతో 31 సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం తదితర పలు అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి నిమ్మల రామానాయుడు.శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ ఐదేళ్ల పాలనలో రూపాయి అభివృద్ధికి నోచుకోలేదన్నారు.గత టిడిపి ప్రభుత్వంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా తీర్చేలా విజ్వేశ్వరం మంచినీటి పథకానికి 200 కోట్లు నిధులు తీసుకువచ్చి పనులు ప్రారంభించామని తరువాత. దురదృష్టవశాత్తు అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ రూపాయి ఖర్చు పెట్టకుండా రద్దు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ విజ్జేశ్వరం నుంచి గోదావరి జలాల మంచినీటి పథకాన్ని పునరుద్ధరించి పనులు చేపట్టామన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో టిడ్కో గృహాలను 70 నుంచి 100 శాతం పూర్తి చేసామని గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చి అసంపూర్తి ఇళ్ళను పూర్తి చేసేందుకు అర బస్తా సిమెంటు గానీ, ఒక్క రూపాయి గానీ ఖర్చు పెట్టని గొడ్డలి పార్టీ ప్రభుత్వం. టిడ్కో గృహాలను లబ్దిదారుల పేరుతో తాకట్టి పెట్టి, పాలకొల్లులోనే 160 కోట్లు నిధులను దారిమళ్ళించిందన్నారు.అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ళను, మరో రెండు నెలల్లోగా లబ్ది దారులకు అప్పగించేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయని మంత్రి నిమ్మల తెలిపారు. గొడ్డలి పార్టీ దళితులను ఓటు బ్యాంకుకు వాడుకుని వదిలేస్తే, నేడు కూటమి ప్రభుత్వంలో కోటి రూపాయల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో దళిత ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.అబద్దాలు, అసత్యాలతో ప్రజలను వంచిస్తూ, రౌడీలుగా, గూండాలుగా చలామణి అవుతున్న గొడ్డలి పార్టీ నాయకులను రాజకీయాలనుండి తరిమికొట్టాలని మంత్రి నిమ్మల పిలుపునిచ్చారు.అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో మహిళలను అవహేళనగా కించపరుస్తున్న గొడ్డలి పార్టీ నాయకులను మహిళలే నిలదీయాలని అన్నారు. కూటమి నాయకులతో కలిసి శంఖుస్థాపనలలో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు కు అన్ని ప్రాంతాలలో మహిళలు, స్థానిక కూటమి నాయకులు ఘనంగా స్వాగతించారు.

## వైఎస్ఆర్సిపి ఐడి కార్డులను అందుకున్న కుడేరు మండల వైసిపి నాయకులు



**సెప్టెంబర్ 20 ప్రజాజ్యోతి న్యూస్ :-** ఉరవకొండ నియోజకవర్గం ఉరవకొండలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి మరియు అబ్జర్వర్ మరియు ఇతర ముఖ్య నాయకుల సమక్షంలో కుడేరు మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐడెంటి కార్డులను కుడేరు మండల నాయకులకు అందజేసిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే మరియు ఉరవకొండ నియోజకవర్గం రెడ్డి.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్ర రెడ్డి,ఎంపీపీ నారాయణరెడ్డి,వైస్ ఎంపీపీ దేవా మంజునాథ్ రెడ్డి జల్లిపల్లి దేవేంద్ర శ్రీనివాస్ నాయుడు భయపరెడ్డి ఈశ్వర్ రెడ్డి ఈశ్వర్ రెడ్డి నీలకంఠ రెడ్డి పరమేశ్వర్ రెడ్డి ముద్దలాపురం మాజీ సర్పంచ్ ధనుంజయ జరుపుకున్న నాగేంద్ర శివరాంపేట అల్లా బకాష్ లక్ష్మన్న యాదవ్ వినోద్ బంధుకు పెన్నోబులెస్ నరసింహులు కుడేరు మండలంలో అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు ఎంపీటీసీ వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కల్యం గ్రామంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 50 కుటుంబాలు



**సెప్టెంబర్ 20 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** రాయదుర్గం నియోజకవర్గం, హీరేహాల్ మండలం, కల్యం గ్రామంలో రాయదుర్గం మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మెట్టు గోవిందరెడ్డి గారి ఆధ్వర్యంలో కూటమికి చెందిన 50 కుటుంబాలు, గ్రామానికి చెందిన కీలక నాయకుడు నాగరాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజల పక్షాన పోరాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి గారు మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి, కూటమి ప్రభుత్వానికి ప్రజల తీర్పు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, మండల ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పాడుబడిన హాస్టల్‌లో గంజాయి కలకలం

**ఇద్దరి అరెస్ట్ 430 గ్రాముల గంజాయి, 9 టాపెంటాడోల్ టాబ్లెట్లు స్వాధీనం**



**చుండూరు సెప్టెంబరు 20 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మోదుకూరు గ్రామ శివారులోని పాడుబడిన హాస్టల్ భవనంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను చుండూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 430 గ్రాముల గంజాయి, 9 టాపెంటాడోల్ టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో కలిసి హాస్టల్ వద్ద తనిఖీలు చేపట్టి పొన్నూరు మండలం దండమూడికి చెందిన కంబాల శ్రీనాథ్‌రెడ్డి 22, మోదుకూరుకు చెందిన మొవ్వ వంశీ 22 ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను ఆదివారం తెనాలి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.ఈ ఘటనపై చుండూరు పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 57/2026గా ఎన్‌డీపీఎస్ యాక్ట్, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఆనంద్ తెలిపారు.

## నేటి నుంచి మోస్తరు వర్షాలు- డాక్టర్ కే రాఘవేంద్ర చౌదరి



**ఎమ్మిగనూరు,సెప్టెంబర్ 20(ప్రజా జ్యోతి):** నేటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని, బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో సెప్టెంబర్ 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె. రాఘవేంద్రచౌదరి తెలిపారు. ఈ కాలంలో పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35.8 నుంచి 37.8 డిగ్రీల వరకు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 26 నుంచి 27 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గంటకు 6 నుంచి 13 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

## మాల ఉలిగమ్మ కుటుంబానికి టీడీపీ నాయకుల పరామర్శ



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 20(ప్రజా జ్యోతి ):** పట్టణంలోని 30వ వార్డుకు చెందిన మాల ఉలిగమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆమె భౌతికకాయానికి ఎమ్మిగనూరు పట్టణ టీడీపీ కోశాధికారి సి. విజయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అంత్యక్రియల ఖర్చుల కోసం కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సహాయం అందించినట్లు విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు భీమన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మా గుర్తింపు కార్డే మా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి.. వైసిపి మండల నాయకులు కుంభళనూర్ అనిల్ కుమార్



**కౌతాళం, సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి** కౌతాళం మండల కేంద్రమైన కౌతాళంలోని శనివారం రోజున వైసిపి గుర్తింపు కార్డు మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతుల మీదుగా తీసుకున్నామని కుంబలనూరు క్యాంప్ వైసిపి మండల నాయకులు అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు అనిల్ కుమార్ మాట్లాడుతూ మా గుర్తింపే ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అని అన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అడుగుజాడల్లో నడవడం మా అదృష్టం అని అన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మా మండలానికి వస్తున్నారంటే మాకు పండుగ వేడుక కన్నా ఎక్కువే అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయం, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఐదవ సారి ఎమ్మెల్యే గెలవడం, బాలనాగిరెడ్డి మంత్రి అవడం ఖాయమని వైసిపి నాయకులు అనిల్ కుమార్ అన్నారు.

## నేటి నుంచి పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఎం పి డి ఓ సయ్యద్ ఉమర్



**హోళగుంద, సెప్టెంబర్ 20, ప్రజా జ్యోతి న్యూస్ –** విద్యార్థుల ఆధార్ కార్డుల బయోమెట్రిక్ అప్‌డేట్‌తో పాటు ఇతర ఆధార్ సంబంధిత సేవలను అందించేందుకు హోళగుంద మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సయ్యద్ ఉమర్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు ఆయా పాఠశాలల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

**పాఠశాలల వారీగా ఆధార్ శిబిరాల వివరాలు**

**సెప్టెంబర్ 21:**
ఎల్లార్తి జడ్పీ హైస్కూల్‌తో పాటు హోళగుంద నేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆధార్ కేంద్రాలు.

**సెప్టెంబర్ 22:**
బి.జి. హళ్లి, ఎల్లార్తి ప్రభుత్వ పాఠశాలలు, నేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సేవలు.

**సెప్టెంబర్ 23:**
హోళగుంద బస్టాండ్ సమీపంలోని కన్నడ పాఠశాల, హెబ్బటం జడ్పీ హైస్కూల్, హోళగుంద రాయల్ రిఫా పాఠశాలలో కేంద్రాలు.

**సెప్టెంబర్ 24**
చిన్నహ్యాట, నేరనికి ప్రభుత్వ పాఠశాలలు, హోళగుంద రాయల్ రిఫా పాఠశాలలో ఆధార్ సేవలు.

**సెప్టెంబర్ 25**
సులవాయి జడ్పీ హైస్కూల్, ఎం.డి. హళ్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. విద్యార్థులు ఆధార్‌లో అవసరమైన మార్పులు, అప్‌డేట్ ప్రక్రియలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మతసామరస్యాలకు ప్రతీక గణేష్ ఉత్సవం

బీసీ సంఘం నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దుర్గం షబ్బీర్



**రాయచోటి సెప్టెంబర్ ,20(ప్రజా జ్యోతి)** రాయచోటిలో మతసామరస్యాలకు ప్రతీకగా గణేష్ ఉత్సవాల నిర్వహణ ఎంతో ఆనందాన్ని ఇస్తుందని బీసీ సంఘం నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దుర్గం షబ్బీర్ పేర్కొన్నారు. ఆదివారం మాసాపేట వరిగ రోడ్లో పూలుకుంట రెడ్డెన్న ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద వినాయక లడ్డును షబ్బీర్ 1,11,116 రూపాయల కు వేలంపాటలో లడ్డూను దక్కించుకున్నారు వర్షాలు బాగా కురిసి రైతులందరూ సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన కోరుకున్నారు ఈ కార్యక్రమంలో పూలుకుంట రెడ్డెన్న,షమీమ్ ,రమణ రామయ్య,సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై ఉరవకొండ లో వైసీపీ సన్నాహక సమావేశం

-- ఉరవకొండ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర పీఏసీ మెంబర్ శ్రీ వై. విశ్వేశ్వర్ రెడ్డి గారు ఆధ్వర్యంలో ఐడీ కార్డులు పంపిణీ

-- ముఖ్య అతిథిగా హాజరైన ఉరవకొండ అబ్జర్వర్ మడకశిర వై.సీ గోవర్ధన్ రెడ్డి గారు రాయలసీమ ఫోరం కన్వీనర్ రమణ గారు జిల్లా అధికార ప్రతినిధి సిపి వీరన్న అన్నగారు పాల్గొన్నారు.

-- స్థానిక ఎన్నికలకు సన్నద్ధం.. కరువు పరిస్థితులపై పోరాడేందుకు దిశానిర్దేశం.







**సెప్టెంబర్ 20 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :–** ఉరవకొండ నియోజకవర్గంలోని వైసీపీ సమన్వయకర్త శ్రీ.వై. విశ్వేశ్వర్ రెడ్డి గారు ఆధ్వర్యంలో సభాధ్యక్షులు ఉరవకొండ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు డిష్. సురేష్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లెల జగదీష్ గంగాదర్ గారు అధ్యక్ష వర్గంగా సభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ఐడి కార్డులు పంపిణీ గురించిసమావేశం శ్రీ.వై. విశ్వేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయి ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా రూ. 2.80 లక్షల కోట్లనే నేరుగా ప్రజలకే అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ దౌర్జన్యాలకు ఎవరూ భయపడొద్దు. వైసీపీ హయాంలో 65 లక్షల మందికి పింఛన్ అందేది. రెండేళ్లలో మూడున్నర లక్షల మందికి కోత పెట్టారు. ఎన్నికలు వస్తున్నాయని ఇప్పుడు కొత్త పింఛన్లు అంటున్నారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మన నియోజకవర్గంలో మెజార్టీ స్థానాలు గెలిచాం. త్వరలో జరిగే ఎన్నికల్లోనూ వైసీపీ సత్తా ఏంటో చూపుదాం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం. ఈ రోజు కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం. రానున్న మన ప్రభుత్వంలో కార్యకర్తలకి పెద్దపీట వేస్తాం. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన గురించి ప్రజలకు తెలియజేయండి. ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్ హయాంలో జరిగిన మంచిని గుర్తు చేయండి. అధికార పార్టీ నేతలకు ప్రజా సంక్షేమం పట్టలేదు. మట్టి, ఇసుకను దోచుకుంటున్నారు. గ్రామగ్రామాన మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. తుంగభద్ర డ్యాంలో 83 టీఎంసీలు ఉన్నా మనకు నీళ్లు రావడం లేదు. శ్రీశైలంలోనూ అదే పరిస్థితి. 109 టీఎంసీలు ఉన్నా నీటిని తీసుకురాలేక పోతున్నారు. ఎన్నడూ లేని విధంగా హంద్రీనీవా ద్వారా 52 టీఎంసీలు తెచ్చామని ప్రచారం చేసుకుంటున్నారు. వచ్చిన నీళ్లన్నీ ఎక్కడికెళ్లాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేలు అధికార కూటమికి చెందిన వాళ్లే. రైతుల కష్టాలు తెలిసిన వాళ్లు ఎమ్మెల్యేలుగా ఉన్నా ఈ రోజు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. అసలు రైతుల గురించి ఆలోచించే తీరికే ప్రజాప్రతినిధులకు లేదు. ఈ రోజు ఏ నియోజకవర్గంకు వెళ్లినా పంటలు ఎండిపోయిన పరిస్థితి మనం చూస్తున్నాశీ. కూటమి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి బుద్ధి చెప్పే టైం వచ్చింది. మనం అధికారం కోల్పోయినా రైతుల కోసం, ప్రజల కోసం పోరాటాలు చేస్తున్నాం. రానున్న స్థానిక ఎన్నికల్లో మీ అభ్యర్థులను మీరే సెలెక్ట్ చేసుకుని, వాళ్ళని మీరే ఎలెక్ట్ చేసుకోండి.. సెలెక్ట్--ఎలెక్ట్ అంతా మీరే చేసుకోండి. రానున్న స్థానిక ఎన్నికల్లో మన పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రతి ఒక్కరినీ గెలిపించుకోవాలి. ఇప్పుడున్న కార్యకర్తలే రేపటి నాయకులు. అందరూ కలిసి ఒకరికొకరు అండగా నిలిస్తూ కూటమి అరాచకాలు ఎదుర్కొందాం. జిల్లా పరిషత్ మొదలు మండల, మున్సిపల్, గ్రామ పంచాయితీలు అన్నింటిలో మన పార్టీ జెండా ఎగరవేస్తాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం గా ప్రతి ఒక్కరూ పని చేయండి. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటాం. మీ కష్టానికి ఫలితం తప్పక ఉంటుంది. కూటమి కుట్రలకు ఏ ఒక్కరూ భయపడకుండా ఎన్నికల్లో ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. మనమంతా ఐక్యమత్యంగా ఉంటే ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు పార్టీ ఎవరిని పోటీలో నిలిపితే వాళ్ళ గెలుపు కోసం అందరూ పనిచేద్దాం. అలాగే ప్రతి మండల కేంద్రంలోనూ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి స్థానిక సంస్థలపై దినార్శాన్ని ధ్యాసం చేసి మన పార్టీ కమిటీలకు వచ్చిన ఐడి కార్డులు కూడా పంపిణీ చేయండి అని ఆయన తెలియజేశారు. అలాగే ఈనెల 28వ తేదీన రైతులు సమస్యలపై ధర్నా ఉంటుంది అందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తులూరు అశోక్ అన్ని మండలాల మండల పార్టీ అధ్యక్షులు ఉరవకొండ రూరల్ అధ్యక్షులు ఏర్రిస్వామి రెడ్డి వజ్రకరూరు మండల అధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి బెలుగుప్ప మండల అధ్యక్షులు మచ్చన్న కూడేరు మండల అధ్యక్షులు రామచంద్రారెడ్డి ఉరవకొండ పట్టణ అధ్యక్షులు ఈడిగ ప్రసాద్ విడపనకల్లు మండలం అధ్యక్షులు కె రమేష్ ఎంపీపీలు నరసింహులు నారాయణరెడ్డి దేవి భాయ్ బెలుగుప్ప జడ్పిటిసి త్రిలోక్ నాథ్ రెడ్డి నాయకులు భీమిరెడ్డి శివలింగప్ప బసవరాజ్ ఏసీ ఎర్రిస్వామి దేవేంద్ర కొడికి గోవిందు ఓబన్న బోయ సుశీలమ్మ ఉస్మాన్ అసిఫ్ జిలాన్ మరియు పెద్ద ఎత్తున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# గొండ్వానా రాష్ట్రంతోనే ఆదివాసుల అభివృద్ధి సాధ్యం

ఐదో షెడ్యూల్ ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక గొండ్వానా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి

ఆదివాసుల భూములు, నీటి వనరులు, ఉద్యోగాలు, నిధులపై సంపూర్ణ హక్కులు కల్పించాలి : దాట్ల నాగేశ్వరరావు

ఆదివాసి సంక్షేమ పరిషత్ 3898/90 జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు







**కూనవరం సెప్టెంబర్ 20. ప్రజా జ్యోతి** తేది. 20-09-2026 న భద్రాచలంలో ఐటిడిఏ గిరిజన భవన్ లో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొర అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు దాట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసుల భూములు, అడవులు, నీటి వనరులు, సంస్కృతి, సంప్రదాయాలు, ఉపాధి అవకాశాలను రక్షించడంతో పాటు సమగ్ర అభివృద్ధి సాధించాలంటే ఐదో షెడ్యూల్ ప్రాంతాలను సమగ్రంగా కలుపుతూ ప్రత్యేక గొండ్వానా రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ 3898/90 జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. లంబాడీలు ఎస్టీలు కాదని 2011 సంవత్సరంలో మొట్టమొదటిసారిగా గౌరవ హైకోర్టులో ఆదివాసి సంక్షేమ పరిషత్ 3898/90 కేసు వేసిందని గుర్తు చేశారు. నిజమైన షెడ్యూల్ తెగలకు విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాల్లోనూ తీవ్రమైన అన్యాయం జరుగుతుందని దీన్ని మొదటినుంచి ఆదివాసి సంక్షేమ పరిషత్ పోరాటం చేస్తుందని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు తమ సంఘం పోరాటం చేస్తుందని అన్నారు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) కింద ఐదో షెడ్యూల్ ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాల పరిపాలనకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయని, గిరిజనుల భూములు మరియు ఇతర సామాజిక ప్రయోజనాలను రక్షించేందుకు ప్రత్యేక రాజ్యాంగ పరిరక్షణలు కల్పించబడ్డాయని ఆయన తెలిపారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో తరతరాలుగా ఆదివాసులు సాగు చేస్తున్న భూములు అన్యాక్రాంతం కాకుండా కఠినమైన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమి బదలాయింపులు, ఆక్రమణలు, వివాదాల విషయంలో ఆదివాసులకు న్యాయం జరిగేలా ప్రత్యేక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. అలాగే ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లోని ఆదివాసి నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం తీసుకురావాలని అన్నారు. స్థానిక వనరులపై ఆధారపడి ఉన్న ప్రాంతాల్లో స్థానిక ఆదివాసి యువతకు విద్య, ఉద్యోగం, ఉపాధిలో ప్రాధాన్యత కల్పించే విధానం అవసరం ఉందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రవహిస్తున్న నదులు, వాగులు, జల వనరులను స్థానిక ఆదివాసి ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. నీటి వనరుల వినియోగంలో స్థానిక ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆదివాసుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులు ఎంత? ఏ పథకాలకు ఎంత ఖర్చు చేస్తున్నారు? ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? షెడ్యూల్డ్ ప్రాంతాల్లో మౌలిక వసతులకు ఎంత నిధులు వినియోగించారు? అనే అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక గొండ్వానా రాష్ట్రం కోసం ప్రజాస్వామ్య ఉద్యమం ఐదో షెడ్యూల్ ప్రాంతాలన్నింటినీ సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పరిపాలనా వ్యవస్థ అవసరమనే అభిప్రాయంతో గొండ్వానా రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు తీసుకెళ్తామని దాట్ల నాగేశ్వరరావు ఆదివాసి సమాజాన్ని కోరారు తెలిపారు. ఆదివాసుల భూమి--అడవి--నీరు--ఉద్యోగం--విద్య--సంస్కృతి--స్వయం పరిపాలన హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా గొండ్వానా రాష్ట్ర సాధన కోసం ఆదివాసి ప్రజలు ఐక్యంగా చర్చించి, రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో తమ డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గత 30సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న షెడ్యూల్ తెగలకు చెందిన వలస ఆదివాసులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కోసం కుల ధ్రువీకరణ పత్రాలు, వృద్ధాప్య పెన్షన్లను మంజూరు చేయాలని ప్రభుత్వానికి కోరారు. తదనంతరం సంక్షేమ పరిషత్ తెలంగాణ రాష్ట్ర కమిటీని ఏగ్రీవంగానుకోవడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులుగా. ఉయిక శంకర్ కార్యవర్గ సభ్యులు సున్నం రాము, పాయం రమేష్ ,పొట్ట శివాజీ ,కొండ్రు శ్రావణ్, ఉకే నాగేశ్వరరావు, ఇరపరాజుఎన్నుకోవడం జరిగింది ఈ సమావేశంలో పాల్గొన్నవారు ఆదివాసి సంక్షేమ పరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యులు తెల్లం రామారావు, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు, ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పూసం శ్రీను, ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ కోశాధికారినూప అనిల్, బాడిస వెంకటేష్, కంగాల కోటేశ్వరరావు, మడకం నందా, దుబీ.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## నాయుడు వీధిలో ముగిసిన సప్తమ నవరాత్రి ఉత్సవాలు

– మేళా తాళాలతో ఘనంగా నిమజ్జోనత్సవ కార్యక్రమం

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాయుడు వీధిలో సప్తమ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ మేరకు పురోహితులు కూనపులి రామకృష్ణ వేద మంత్రోర్చనలతో గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనం మీదకి గణనాథుడిని ఎక్కించి మేళ తాళాలు డప్పు వాయిద్యాల మధ్య శివకుమార్ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువతీ , యువకులు ఉత్సాహంగా పాల్గొని ,గణపతి బప్పా మోరియా ,జై బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ పురవీధులలో జరిగిన నిమజ్జనోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.






## లయన్స్ క్లబ్ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే... పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు (20-09-26)( ఆదివారం) పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు , డిస్టిక్ చైర్ పర్సన్. డాక్టర్ శాంతి ప్రియ.శంకర కంటి ఆసుపత్రి ( బెంగుళూరు ) కంటి వైద్య నిపుణులు డాక్టర్ పురవి చైర్ పర్సన్ మాట్లాడుతూ .కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు గురించి తెలియజేసారు. బ్యాక్టీరియా, వైరస్,ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్త గా సంరక్షించుకోవాలన్నారు. పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పట్రా శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి ఏం .నాగరాజు డిస్టిక్ చైర్ పర్సన్ జయరాం రావు మాట్లాడుతూ..... కళ్ళు మాన వునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతి అని అన్నారు. ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకోగలరని వ్యాఖ్యానించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్. పురవి కంటి వైద్య శిబిరానికి వచ్చిన 130 మందిని పరీక్షించి అందులో 60. మందిని. కంటి ఆపరేషన్ కు రెఫర్ చేశారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ వైద్య శిబిరం నందు డిస్టిక్ చైర్ పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ డాక్టర్ మురళీకృష్ణ జయరాం రావు కమిత్కర్ రఘువీర్ రావు. మానవ హక్కుల కమిషన్, ఉ. పర్యావరణ పరిరక్ష ణ దక్షణ భారతదేశ సెక్రటరీ ఆవుల ప్రసాద్ క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్రా నరేష్ కుమార్, డైరెక్టర్స్ పత్ర రాకేష్, ఏ. నాగరాజు. అంజి నాయక్ నల్లయ్య శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ, శంకర హాస్పిటల్ సిబ్బంది మరియు లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎండిన పంటలకు ఊపిరి.. నందవరంలో వరుణుడి కరుణ!

**అల్పపీడన ప్రభావంతో తెల్లవారుజామున వర్షం.. రైతుల్లో ఆనందం**



**నందవరం, సెప్టెంబరు 20 (ప్రజా జ్యోతి):**అల్పపీడన ప్రభావంతో నందవరం మండలంలో ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. కొంతకాలంగా వర్షాలు లేక పంటలు ఎండిపోతుండటంతో ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. ఖరీఫ్ పంటలకు కీలక సమయంలో వరుణుడు కరుణించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వర్షాభావ పరిస్థితులతో పొలాల్లో పంటలు నీటి కోసం ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడగా, మరికొన్ని పంటలు నీటి కొరతతో వాడిపోతున్నాయి. ఈ సమయంలో కురిసిన వర్షం పంటలకు అవసరమైన తేమను అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.ఇటీవల ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఉక్కపోత, వేడి వాతావరణంతో ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామున వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలకు కూడా కొంత ఉపశమనం లభించింది. వర్షాలు మరింతగా కురిసి పంటలకు పూర్తిస్థాయిలో మేలు జరగాలని రైతులు, ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.వర్షం మరింత కురిస్తేనే పంటలకు పూర్తి ప్రయోజనం చేకూరుతుందని రైతులు తెలిపారు.

## సారూ మా ఊరిలో తాగునీటి సమస్య ఉంది.. తీర్చండి సారూ అంటున్న వీరబల్లి మండల ప్రజలు

**తాగునీటి కష్టాలతో అల్లాడుతున్న ప్రజలు**

**పట్టించుకోని అధికార యంత్రాంగం**

**మా గోడు పట్టించుకునే నాథుడే లేదంటూ వాపోతున్న ప్రజలు**





**వీరబల్లి సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి** కడప జిల్లా వీరబల్లిమండలంలో వంగిమళ్ళ, దిగువరాచపల్లి, గడికోట, వీరబల్లి, పెద్దివీడు గ్రామాలల్లో తాగునీటి సమస్య తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగేందుకు గుక్కెడు నీరు లేక ఒక పక్క పశువులు, మరో పక్క ప్రజలు తల్లడిల్లి పోతున్నారు. గ్రామాలలో ఉన్న మంచినీటి పథకాలు మర్మతులకు గురి కావడంతో ప్రజలు గ్రామ సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు బిందెలు తీసుకొని పరుగులు తీస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తారు కానీ తమ సమస్యలు పట్టించుకునే నాథుడే లేదంటూ ప్రజలు వాపోతున్నారు. వెంటనే తమ ప్రాంతాలలో తాగునీటి సమస్య పరిష్కరించకపోతే మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు హెచ్చరిస్తున్నారు.

## గాలం గుండ్లపల్లి లో ఘనంగా వినాయక నిమజ్జనం



**రామాపురం సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి** రామాపురం మండలంలోని కల్పనాయన చెరువు గ్రామ పరిధిలోని గాలం గుండ్ల పల్లెలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నిమజ్జన ఊరేగింపు సోమవారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ బాబు ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట నిర్వహించగా, చిత్తల వెంకటరమణ, బాలాజీలు కలిసి రూ.30 వేలతో లడ్డూను దక్కించుకున్నారు.అనంతరం గ్రామ ప్రజలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మేళతాళాల నడుమ వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తుల సందడితో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

## లయన్స్ కంటి ఆసుపత్రిలో 12 మంది కంటి రోగులకు ఆపరేషన్లు



**రాయచోటి సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి** రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 12 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట,రైల్వే కోడూరు,సుండుపల్లె, వీరబల్లి, యర్రావారిపాలెం కేవీపల్లి, కలకడ, కలికిరి, పీలేరు, గుర్రంకొండ, పెద్దమండెం, ఎన్.పి. కుంట, చక్రాయపేట, కడప తదితర ప్రాంతాల నుండి వచ్చిన 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 12 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 25 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు,అద్దాలు పంపిణీ చేశారు.అనంతరం కంటి ఆపరేషన్ ల కోసం వచ్చిన కంటి రోగులతో పాటు వారి వెంట ఉన్న సహాయకులకు అన్నమయ్య జిల్లా పరిధిలోని గుర్రంకొండ మండలం నడిమి కండ్రిగ పంచాయతీలోని మొటుకు గ్రామానికి చెందిన దాత ఎన్నార్ఐ ఎర్రగొండ గోవర్ధన్ రెడ్డి ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి.ఆర్ స్వరూప్ గుప్తా,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష,ఏపీఐఐసి మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి,కంటి వైద్యులు భార్గవి, ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అజామ్ మేనల్లుడి నిఖా వేడుకలల్లో పాల్గొన్న డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి



**రామాపురం సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రామాపురం మండలం, గువ్వల చెరువు గ్రామం నందు గల మైనార్టీ టిడిపి నాయకుడు అజామ్ మేనల్లుడి నిఖా వేడుకలు కడప పట్టణం రాజా రాణి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకుడుడాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డిముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్య క్రమంలో పలువురు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పుల్లాసి లక్ష్మన్న మృతి పార్టీకి తీరని లోటు

**మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి**



**ప్రజాజ్యోతి న్యూస్ ప్యాపిలి సెప్టెంబర్ 20** చిన్న పూదేళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు పుల్లాసి లక్ష్మన్న ఆకస్మిక మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పూలమాలలు వేసి నివాళ లర్పించారు.ఆదివారం ?లక్ష్మన్న మృతి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బుగ్గన చిన్న పూదేళ్ల గ్రామానికి చేరుకుని, ఆయన మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లక్ష్మన్న మృతి చెందడం గ్రామానికి, పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా బుగ్గన హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నేతలు బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగభూషణ్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రామచంద్రుడు, భువనేశ్వర్ రెడ్డి, బోరెడ్డి రాము, ప్రభాకర్ రెడ్డి, చిన్న రామంజి, బండి ఎర్రిస్వామి,చెన్నకేశవులు,బంగి నాగరాజు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

**వైఎస్సార్సీపీ శ్రేణులకు మాజీ మంత్రి బుగ్గన పిలుపు**



**బేతంచెర్ల:సెప్టెంబర్ 20(ప్రజా జ్యోతి)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బేతంచెర్ల పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్సీపీ కార్యకర్తల మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయభేరి మోగించేలా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజల మద్దతు కూడగట్టాలని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులు అందజేయడం ద్వారా ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం లభిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఐడీ కార్డులు పొందిన కార్యకర్తలకు భవిష్యత్‌లో వైఎస్సార్సీపీ అధికారంలోకి వస్తే తగిన గుర్తింపు, బాధ్యతలు కల్పిస్తామని పేర్కొన్నారు.పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని బుగ్గన కోరారు. పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్తకు భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, బాబు రెడ్డి, ముర్తుజావలి, కాజా హుస్సేన్, సిహెచ్. లక్ష్మిరెడ్డి, బీరువలి నాగేశ్వరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామచంద్రుడు, మండల కన్వీనర్ కుంచ తిరుమలేశ్వరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చమర్తి భగీరథ ప్రయత్నం సఫలం

**మంచికి కదులుతున్న గంగమ్మ..**

**చమర్తి సంకల్పం కు తోడవుతున్న గంగమ్మ తల్లి కటాక్షం**

**ఓదివీడు గ్రామం కావలి పల్లి నందు త్రాగునీటి కష్టాలు తొలగించిన చమర్తి**

**రాజంపేట నియోజకవర్గంలో చమర్తి ఆధ్వర్యంలో ప్రతి మండలంలో ఎక్కడ త్రాగునీటి బోర్లు వేయించిన అక్కడ నీళ్ళు పడటం ఆ గ్రామ ప్రజల అదృష్టం**



**వీరబల్లి సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి** వీరబల్లి మండలం ఓదివీడు గ్రామం కావలపల్లి గ్రామస్తులు త్రాగునీటి సమస్యతో మహిళలు ఇబ్బందులు పడుతుండడంతో వారు ఈ మధ్య రాజంపేట అసెంబ్లీ టీడీపీ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు గారి దృష్టికి తెలియజేయ డంతో వారు సానుకూలంగా స్పందించి కూటమి ప్రభుత్వంలో ప్రజలు త్రాగునీటితో ఇబ్బందులు పడకూడదని వెంటనే అధికారులతో మాట్లాడి అక్కడ వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించగా వెంటనే ఆ గ్రామంలో త్రాగునీటి బోరు వేయించగా అక్కడ 1.5 ఇంచుల త్రాగునీరు పడటంతో ఆ గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వారి కళ నెరవేరడంతో ఆ గ్రామస్తులు రాజంపేట అసెంబ్లీ టీడీపీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు గారికి మరియు కూటమి ప్రభుత్వానికి అధికారులకు ధన్యవాదాలు తెలపడం జరిగినది.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు టిడిపి






**ప్రజాజ్యోతి న్యూస్: ప్యాపిలి సెప్టెంబర్ 20** రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అర్థరహిత ఆరోపణలు చేయడం మాని, ప్రభుత్వంపై మాట్లాడే ముందు ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నాయకులు వాస్తవాలు గ్రహించి ఆత్మవిమర్శ చేసుకోవాలని కూటమి నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే గ్రామాలు, మండలాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. కేంద్ర నిధులను సమర్థవంతంగా రాబట్టడం తో పాటు పెట్టుబడుల ఆకర్షణ, రోడ్లు, సాగునీరు, తాగునీరు, విద్యా, వైద్య రంగాల విస్తరణ కు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. అంతేగాక, పింఛన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వికలాంగులు-దివ్యాంగులకు చేయూత, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తున్నామని, వీటిపై ప్రతిపక్ష నేతలు నిరాధార ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.రాజకీయాల్లో ప్రజాస్వామ్యబద్ధమైన విమర్శలను ఆహ్వానిస్తామని, అయితే అవి వాస్తవాలు, రికార్డుల ఆధారంగా ఉండాలే తప్ప వ్యక్తిగత దూషణలుగా మారకూడదని నేతలు పేర్కొన్నారు. అభివృద్ధి అనేది ఏ ఒక్క నాయ కుడి సొంత ఆస్తి కాదని, ప్రజలు కట్టే పన్నులు, ప్రభుత్వ నిధులతోనే పనులు జరుగుతాయన్న సత్యాన్ని గుర్తించాలని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్న తరుణంలో బాధితులకు బాసటగా నిలవాల్సింది పోయి, వాటిని సైతం రాజకీయాలకు వాడుకోవడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. పంటల బీమా ప్రీమియం, కేంద్ర-రాష్ట్ర వాటాలు, విపత్తుల నిర్వహణపై కనీస అవగాహన లేకుండా మీడియా ముందు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. గత పాలనలో తమ నాయకుడు సూర్యప్రకాశ్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలపై, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలపై వైఎస్సార్సీపీ నేతలకు అనుమానాలు ఉంటే తేదీ, స్థలం నిర్ణయించాలని, ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్య క్షుడు సుదర్శన్, చైర్మన్ రాజా రేణుక, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, కొంగనపల్లె మధు, గద్దం ప్రసాద్ రెడ్డి,చల్లా వీరా,సిద్దపు పుల్లారెడ్డి,కదిరప్ప, జనసేన క్రిష్టిపాడు చంద్ర, గుడిపాడు వెంకటరెడ్డి, నడిగడ్డ నాగేంద్ర, గండికోట రమేష్, వార్డు మెంబర్ వెంకటేష్, ఆర్.సి. మద్దిలేటి,పుల్లయ్య టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదివాసీ పల్లెల్లోకి నల్లా ఎలా వచ్చింది?

ఆ ఊరులో విద్యుత్తు లేదు, రహదారీ లేదు, అంగన్‌వాడీ లేదు. కానీ... ఇంటి ముందే నల్లా ఉన్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం అశ్వాపురంపాడు గిరిజన ఆవాసంలో మేం ఫీల్డ్ విజిట్ చేస్తున్నాం. దట్టమైన అటవీ ప్రాంతంలోని ఆ పల్లెలో 30 కుటుంబాలకు చెందిన 125 మంది గుత్తికోయ ఆదివాసీలు నివసిస్తున్నారు. 'మాకు కరెంట్ లేదు... రహదారి లేదు... మా పిల్లలకు అంగన్‌వాడీ బడి కూడా లేదు...' అని ఒక మహిళ తన బాధలను చెప్పింది. తాగునీరు ఉన్నదా? అని అడిగాం. అప్పుడే ఒక యువకుడు ముందుకొచ్చాడు. 'నీళ్లకు లోటులేదు... వాటి వల్లనే మేం ఈ మాత్రం జీవిస్తున్నాం' అని తెలిపాడు. ఆ మాట మమ్మల్ని ఒక్క క్షణం ఆపింది. మీకు నీళ్లు ఎలా వస్తున్నాయి? అని అడిగాం. అతను పక్కనే ఉన్న నల్లాను చూపించాడు. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయని తెలిపాడు. మారుమూల గిరిజన పల్లెలో కూడా మిషన్ భగీరథ పైపుల ద్వారా ప్రతి ఇంటికీ రోజుకు రెండుసార్లు నీళ్లు వస్తున్నాయి. అడవిలో మిగిలిన అన్ని చీకట్ల మధ్య ఆ చిన్న నల్లా ఒక పెద్ద వెలుగులా అనిపించింది. ఎందుకంటే... తాగునీరు అంటే దాహం తీర్చే నీరు మాత్రమే కాదు. అది ఆరోగ్యం, అది సమయం. అది మహిళల శ్రమకు విముక్తి. అది పిల్లల బాల్యం. అది ఒక కుటుంబం తన గౌరవంతో జీవించే అవకాశం. తెలంగాణలోని అనేక మారుమూల, గిరిజన ప్రాంతాల్లో తాగునీటి కోసం మహిళలు, పిల్లలు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. కొన్ని చోట్ల బావులు, వాగులు, చెలిమెలే ఆధారం. వేసవిలో అవి ఎండిపోతే పరిస్థితి మరింత దారుణంగా మారేది. నీరు దొరికినా అది తప్పనిసరిగా సురక్షితమైన నీరు అవుతుందనే నమ్మకం ఉండదు. వాగుల్లో ప్రవహించే నీటిలోనే పశువులు తిరుగుతుంటాయి. అదే నీటిని ప్రజలు వడకట్టుకుని, మరిగించి లేదా కొన్నిసార్లు ఎలాంటి శుద్ధి లేకుండానే తాగాల్సి వచ్చేది. నీటి కోసం వెళ్లే ప్రతి ప్రయాణమూ అంటే ఒక మహిళకు గంటల సమయం. ఆమె ఆ సమయాన్ని కోల్పోతే కుటుంబ ఆదాయానికి, పిల్లల చదువుకు, తన ఆరోగ్యానికి నష్టం. అందుకే ఇంటి ముందుకు వచ్చే సురక్షితమైన నీటి నల్లా ఒక మౌలిక సదుపాయం మాత్రమే కాదు, సామాజిక మార్పుకు ఒక తొలి అడుగు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన, స్థిరమైన పైపుల తాగునీటిని అందించేందుకు భారీ స్థాయిలో మిషన్ భగీరథ పథకాన్ని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. 2016 ఆగస్టు 7న ప్రధానమంత్రి నరేంద్రమోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించి, మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండలో మిషన్ భగీరథను అధికారికంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వ్యక్తికీ రోజుకు 100 లీటర్ల చొప్పున శుద్ధి చేసిన నీటిని అందించడం, ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇవ్వడం దీని ప్రధాన లక్ష్యాల్లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కోసం కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు, వాటి ఉపనదులు, ప్రధాన జలాశయాలను నీటి వనరులుగా ఉపయోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మిషన్ భగీరథ వెబ్‌సైట్ ప్రకారం ప్రస్తుతం ప్రాజెక్టు పరిధిలో 23,861 గ్రామీణ ఆవాసాలు, 54.61 లక్షల గ్రామీణ గృహాలు ఉన్నాయి. మొత్తం పైపులైన్ నెట్‌వర్క్




సుమారు 1.50 లక్షల కిలోమీటర్లు. 2021 తెలంగాణ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ ప్రకారం రాష్ట్రంలోని 24,028 గ్రామీణ ఆవాసాలు మిషన్ భగీరథ ద్వారా పైపుల నీటి సరఫరా పరిధిలోకి వచ్చాయి.

ప్రభుత్వ గణాంకాలు ప్రకారం మిషన్ భగీరథ ద్వారా 2023–24లో 23,960 హ్యాబిటేషన్లను కవర్ చేసింది. ఇదేమీ ఒక చిన్న నీటి పథకం కాదు. ఒక రాష్ట్రం మొత్తాన్ని నల్లాలతో అనుసంధానించాలనే అరుదైన భారీ ప్రయత్నం. అడవుల్లోని ఆవాసాలకు నీరు చేరడం... అంత సులభం కాదు.

మారుమూల గిరిజన ఆవాసాలకు పైపులు వేయడం మైదాన ప్రాంత గ్రామాలకు చేసినంత సులభం కాదు. కొండలు, అడవులు. వాగులు. రోడ్లు లేని మార్గాలు. చిన్న ఆవాసాలు. కొన్నిచోట్ల ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానం చేయడం సాధ్యం కాకపోవడంతో ప్రత్యామ్నాయ నీటి వనరులు, స్థానిక నీటి సరఫరా వ్యవస్థలు అవసరమవుతున్నాయి. 2020లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్ల మండలంలోని రాళ్లాపురం గుత్తికోయ ఆవాసానికి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీరు అందడం ప్రత్యేకంగా వార్తల్లోకి వచ్చింది. ఆ సమయంలో ఆ ఆవాసాన్ని రాష్ట్రంలో పైపుల తాగునీరు పొందిన తొలి గుత్తికోయ ఆవాసంగా పేర్కొన్నారు. అదే సమయంలో మరో అసంపూర్ణ కథను కూడా ఉన్నది. అశ్వాపురంపాడులో ప్రాథమిక పాఠశాల గానీ, అంగన్‌వాడీ కేంద్రం గానీ లేదు. దీంతో అక్కడి 25 మంది చిన్నారులు ప్రాథమిక విద్యకు, పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. అభివృద్ధి ఒకేసారి అన్ని తలుపుల్ని తట్టలేదు. ఇది మన ప్రభుత్వాలకూ, అధికార వ్యవస్థకూ ఒక ముఖ్యమైన పాఠం. ఒక గిరిజన ఆవాసానికి నీరు అందించడం గొప్ప విషయం. కానీ అదే కుటుంబం రాత్రిపూట చీకట్లో ఉంటే? పిల్లలు బడికి వెళ్లడానికి రహదారి లేక ఇబ్బంది పడితే? చిన్నారులకు అంగన్‌వాడీ లేకపోతే? అప్పుడు నీటి నల్లా ఒక మంచి ప్రారంభం మాత్రమే. సంపూర్ణ అభివృద్ధి కాదు. మిషన్ భగీరథలాంటి భారీ పైపుల నీటి వ్యవస్థలను నిర్మించడం ఒక దశ. వాటిని నిరంతరం పనిచేసేలా చేయడం మరో పెద్ద బాధ్యత. ప్రభుత్వాలు దశల వారీగా అభివృద్ధిని కొనసాగించాలి. ప్రభుత్వం విద్యుత్తు, రహదారి, అంగన్‌వాడీ ఏర్పాటుపై దృష్టి సారించాలి.

2026 మార్చిలో ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోనే 141 ఆవాసాలను తాగునీటి కొరతకు గురయ్యే ప్రాంతాలుగా అధికారులు గుర్తించినట్టు నివేదికలు చెప్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో కొన్ని గిరిజన ప్రాంతాల్లో వాగులు, చిన్న నీటి ప్రవాహాలు ఎండిపోయే దుస్థితిని మా ఫీల్డ్ విజిట్‌లో గుర్తించాం. అందువల్ల ఇంటికి నీరు రావడం మాత్రమే కాదు... రానున్న రోజుల్లో కూడా అదే నీరు రావాలంటే అడవులు, వాగులు, చెరువులు, భూగర్భ జలాలను కాపాడుకోవాలి. 'నీళ్లకు లోటులేదు... వాటి వల్లనే ఈ మాత్రం జీవిస్తున్నాం' అని అశ్వాపురంపాడు యువకుడు అన్నపుడు తాగునీరు లేని కుటుంబ జీవితం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఒక మహిళ భుజాలపై మోసిన కుండలో కేవలం నీరు ఉండదు. ఆమె నడిచిన కిలోమీటర్లు ఉంటాయి. ఆమె కోల్పోయిన సమయం ఉంటుంది. ఆమె శరీరంపై పడిన శ్రమ ఉంటుంది. కొన్నిసార్లు... ఆ నీటితో వచ్చిన అనారోగ్యం కూడా ఉంటుంది. అందుకే ఇంటి ముందు ఒక నల్లా కనిపించినప్పుడు... ఒక కుటుంబానికి దక్కిన ఆరోగ్యం. ఒక పల్లెకు వచ్చిన గౌరవం. అభివృద్ధి అంటే భారీ నిర్మాణాలు మాత్రమే కాదు. మనిషి ఇంటి ముందుకు చేరిన చిన్న సౌకర్యమే... నిజమైన అభివృద్ధికి కొలమానం.

# ఓబీసీలకు మరో పోరాటం తప్పదు!



భారతదేశంలో అసమానత గురించి మాట్లాడినప్పుడల్లా పేదరికం, నిరుద్యోగం, ఆదాయం వంటి అంశాలే ఎక్కువగా చర్చకు వస్తాయి. కానీ అంతకంటే ముఖ్యమైన ప్రశ్నలు వేరే ఉన్నాయి. దేశ సంపద ఎవరి చేతుల్లో ఉంది? పెద్ద వ్యాపారాలు, ప్రైవేటు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, మీడియా సంస్థలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? భారీ మైనింగ్, రోడ్లు, విద్యుత్, రక్షణ, సాగునీటి కాంట్రాక్టులు ఎవరికి దక్కుతున్నాయి? సుప్రీంకోర్టు, హైకోర్టులు, విశ్వవిద్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ అత్యున్నత అధికార పదవుల్లో ఎవరి ప్రాతినిధ్యం ఎంత?-- ఈ అంశాలు పెద్దగా చర్చకు రావటం లేదు. దేశంలోని అత్యంత ధనికులైన ఒక శాతం మంది దాదాపు 40శాతం సంపదను కలిగి ఉండగా, దిగువన ఉన్న 50శాతం ప్రజల చేతుల్లో కేవలం 3శాతం సంపద మాత్రమే ఉన్నది. కానీ ఈ ఆర్థిక అసమానతకు సామాజిక రూపం ఏమిటో సమగ్ర సమాచారం లేదు. సంపదలో ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు, ఇతర సామాజిక వర్గాల వాటా ఎంత? అవకాశాల్లో వారి శాతం ఎంత? అధికార వ్యవస్థల్లో ఎవరు ముందున్నారు? ఎవరు వెనుకబడ్డారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగేదే నిజమైన కులగణన. అందుకే కులగణనను కేవలం 'ఎవరు ఏ కులానికి చెందినవారు? వారి మొత్తం జనాభా ఎంత?' అనే ఫక్తు సంఖ్యగా చూడటం పొరపాటు. సమగ్ర సామాజిక, ఆర్థిక ప్రాతిపదిక దృష్టితో చేపట్టే కులగణనే భారత సమాజానికి ఒక ఎక్స్‌రేలా ఉపయోగపడుతుంది. ఈ అంశాన్ని గత కొన్నేళ్లుగా రాహుల్‌గాంధీ జాతీయ రాజకీయ చర్చలోకి తెచ్చారు. కుల గణనను కేవలం జనాభా లెక్కల అంశంగా కాకుండా ప్రాతినిధ్యం, అవకాశాలు, అధికారంలో వాటా అనే ప్రశ్నగా ఆయన నిలబెట్టారు. దేశ జనాభాలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు ఎంతమంది? ప్రభుత్వంలో, ఉన్నత విద్యలో, న్యాయవ్యవస్థలో, మీడియా, కార్పొరేట్ రంగాల్లో వారి వాటా ఎంత? అనే ప్రశ్నలను ఆయన పదేపదే సంధిస్తున్నారు. 'దేశానికి ఎక్స్‌రే అవసరం' అన్న రాహుల్‌గాంధీ వాదన వెనకున్న భావన సరిగ్గా ఇదే. రాహుల్‌గాంధీ నిరంతరంగా కులగణన అవసరాన్ని నొక్కివక్కాణించడంతోపాటు, బిహార్, తెలంగాణ రాష్ట్రాలు కుల ఆధారిత సర్వేలు నిర్వహించడంతో రాబోయే జనగణనలో కులగణన చేపడతానని మోదీ ప్రభుత్వం ప్రకటించాల్సి వచ్చింది. అప్పటివరకూ కులగణనపై వ్యతిరేక వైఖరితో ఉన్న బీజేపీ తీసుకున్న 'యూటర్న్' ఇది. ఆనాడు బిహార్‌లోని ఓబీసీ--ఈబీసీ ఓటర్లను ఆకర్షించడం కూడా బీజేపీ నిర్ణయం వెనక రాజకీయ కారణాల్లో ఒకటి కావచ్చు.

తెలంగాణలో సర్వేకు ముందుగా వివిధ సామాజిక వర్గాలు, సంఘాలు, నిపుణులు, సంబంధిత వర్గాలతో విస్తృతంగా సంప్రదింపులు జరిగాయి. ఏ ప్రశ్నలు అడగాలి? ఏయే సామాజిక--ఆర్థిక అంశాలను నమోదు చేయాలి? కుల గుర్తింపును ఎలా నమోదు చేయాలి? అనే విషయాలపై సూచనలు తీసుకున్నారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన గెజిట్లలో ఉన్న కులాల జాబితాలను ఆధారంగా తీసుకుని వాటిని పద్ధతిగా వర్గీకరించారు. ప్రతి కులానికి ఒక ప్రత్యేక కోడ్ కేటాయించారు. ఒకే కులానికి ప్రాంతాల వారీగా వాడే వేర్వేరు పేర్లు, ఉపకులాల పేర్లు, స్థానిక పేర్లు, సమానార్థక పేర్లను గుర్తించి అవన్నీ సంబంధిత కులానికి కేటాయించిన అదే కోడ్ కిందకు వచ్చేలా వ్యవస్థ రూపొందించారు. ఉదాహరణకు రజక, చాకలి, వన్నార్ వంటి వేర్వేరు పేర్లు ఒకే సామాజిక వర్గానికి సంబంధించినవిగా గుర్తించినప్పుడు అవి వేర్వేరు లెక్కలుగా విడిపోకుండా ఒకే ప్రామాణిక కోడ్ కింద నమోదయ్యేలా చేశారు. తెలంగాణలో సేకరించిన డేటాను కేవలం జనాభా లెక్కలుగా కాకుండా విద్య, ఉపాధి, జీవనోపాధి, ఆస్తులు, వ్యాపార యాజమాన్యం, సామాజిక స్థితి, ప్రాతినిధ్యం వంటి సూచికలతో విశ్లేషించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన నిపుణుల కమిటీ ఈ విశ్లేషణను చేపట్టి నివేదికను విడుదల చేసింది. 2026 ఆగస్టు 14న కేంద్రం విడుదల చేసిన సెన్సెస్ 2027 షెడ్యూలులోని కులం ప్రశ్న రూపకల్పనలోనే ప్రధాన సమస్య (లోపం) ఉంది. ఎస్సీ, ఎస్టీల విషయంలో అధికారికంగా గుర్తించిన జాబితాల ఆధారంగా క్రమబద్ధమైన వర్గీకరణకు అవకాశం ఉండగా, ఓబీసీలూ ఇతర కులాల విషయంలో మాత్రం వ్యక్తి చెప్పిన కులం పేరును ఓపెన్ టెక్స్ట్‌గా నమోదు చేసే విధానాన్ని ప్రతిపాదించారు. ఇది ఓబీసీలకు అన్యాయం చేసే కపట నాటకంగా కనిపిస్తున్నది. 2011 సామాజిక, ఆర్థిక కుల సర్వేలో 46 లక్షలకు పైగా వేర్వేరు కులాలు నమోదు కావడం ఇందుకు ఉదాహరణ. భారతదేశంలో 46 లక్షల కులాలు లేవు. ఒకే కులం వేర్వేరు పేర్లతో, ఉపకులాల పేర్లతో, ప్రాంతీయ పేర్లతో, సమానార్థక పేర్లతో నమోదు కావడంతో లెక్కలు విపరీతంగా చీలిపోయాయి. ఈ సమస్య కేంద్ర ప్రభుత్వానికి తెలియదని అనుకోవడానికి లేదు. 2021లో సుప్రీంకోర్టుకు కేంద్రం స్వయంగా ఇదే సమస్యలను వివరించింది. గత అనుభవంలో ఏ లోపాలు వచ్చాయో ప్రభుత్వానికి తెలుసు. వాటికి పరిష్కారం ఏమిటో కూడా తెలుసు. సామాజిక వర్గం, కులం రెండింటినీ విడిగా నమోదు చేయాలి (బీసీ--యాదవ మాదిరి). రాష్ట్రాలవారీగా అధికారికంగా గుర్తించిన కుల జాబితాలను ఉపయోగించాలి. ఒకే కులానికి ఉన్న వేర్వేరు పేర్లు, ఉపకులాలు, ప్రాంతీయ పేర్లను ఒకే కోడ్ కింద నమోదు చేయాలి. జాబితాలో లేని పేర్లకే స్వేచ్ఛగా నమోదు చేసే అవకాశం (ఓపెన్ టెక్స్ట్‌గా) ఇవ్వాలి. ఓబీసీల కులాలను సరైన జాబితాలు, కోడ్‌లు లేకుండా నమోదు చేస్తే ఒకే కులం వేర్వేరు పేర్లతో చీలిపోవచ్చు. అప్పుడు ఆ కులం జనాభా, దాని సామాజిక స్థితి, విద్య, ఉద్యోగాల్లో దాని ప్రాతినిధ్యం స్పష్టంగా తేలవు. ఇది తర్వాత పెద్ద సమస్యగా మారుతుంది. రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం, సంక్షేమ విధానాల విషయంలో కోర్టులు నమ్మదగిన గణాంకాలను కోరుతున్నాయి. కానీ ఈ కులగణన పద్ధతి ఆదిలోనే బలహీనంగా ఉంటే విశ్వసనీయమైన డేటా ఎలా వస్తుంది? అప్పుడు నష్టపోయేది ఓబీసీలే! అందుకే కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించడంతో ఓబీసీల పోరాటం ముగిసిపోలేదు. అసలైన రెండోదశ పోరాటం ఆవశ్యకత ఇప్పుడు ఎంతగానో ఉన్నది. కేవలం కులగణన జరగడం మాత్రమే కాదు. అది సరైన పద్ధతిలో సమగ్రంగా జరగాలి. ఎన్నికల సమయంలో ఓబీసీలను హిందూ ఐక్యత పేరుతో బీజేపీ తన రాజకీయ వ్యూహంలో భాగం చేస్తున్నది. కానీ అదే ఓబీసీలు విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, అధికారంలో ప్రాతినిధ్యం, వనరుల్లో వాటా గురించి ప్రశ్నిస్తే మాత్రం కపటత్వంతో కూడిన కొత్త షరతులను ముందుకు తెస్తున్నది. ఓబీసీ రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా, అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతోందా అన్నది పరిశీలించేందుకు రోహిణి కమిషన్ ఏర్పాటైంది. ఈ కమిషన్ తన నివేదికను 2023లో సమర్పించినా అది ఇప్పటికీ బహిరంగ చర్చకు రాలేదు. ఓబీసీలలో అంతర్గత అసమానతలపై ప్రభుత్వం స్వయంగా అధ్యయనం చేయించి ఆ ఫలితాలను ప్రజల ముందుకు తీసుకురాకపోవడం అనేక ప్రశ్నలకు, అనుమానాలకు దారితీస్తోంది. ఇంతకాలం కులగణన కోసం పోరాడిన ఓబీసీలు కేవలం జనాభా శాతం గణనతో సంతృప్తిచెంది మౌనంగా ఉంటే భవిష్యత్‌లో సామాజిక న్యాయం పొందలేరు. వారి సంఖ్య సరిగ్గా లెక్కించడంతోపాటు వారి సామాజిక, ఆర్థిక స్థితి దేశం ముందుకు స్పష్టంగా రావాలి. అప్పుడే ఆ గణాంకాల ఆధారంగా విద్య, ఉద్యోగాలు, ప్రాతినిధ్యం, అవకాశాల్లో తమ సముచిత వాటా, న్యాయం గురించి ఓబీసీలు నినదించగలుగుతారు. పోరాడి న్యాయం పొందగలుగుతారు.

## నాయుడు వీధిలో ముగిసిన సప్తమ నవరాత్రి ఉత్సవాలు


– మేళా తాళాలతో ఘనంగా నిమజ్జోనత్సవ కార్యక్రమం





**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాయుడు వీధిలో సప్తమ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ మేరకు పురోహితులు కూనపులి రామ కృష్ణ వేద మంత్రోర్చనలతో గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంత రం ప్రత్యేకంగా అలంకరించిన వాహ నం మీదకి గణనాథుడిని ఎక్కించి మేళ తాళాలు డప్పు వాయిద్యాల మధ్య శివకు మార్ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్ర మాన్ని ప్రారంభించారు. యువతీ యువ కులు ఉత్సాహంగా పాల్గొని గణపతి బప్పా మోరియా ,జై బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ పురవీధులలో జరిగిన నిమజ్జనోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సొసైటీ మాజీ అధ్యక్షుడు సూరిబాబుకు పితృవియోగం



**పోదూరు, (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ బి 20:** పోదూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు, ఆచంట ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి సూర్యనారాయణరాజు (సూరిబాబు) తండ్రి చేకూరి రామకృష్ణంరాజు (87) శనివారం పితృవియోగం జరిగింది. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు చేకూరి నరసింహారాజు (చిట్టిబాబు), రెండవ కుమారుడు చేకూరి సూర్యనారాయణరాజు (సూరిబాబు), మూడవ కుమారుడు చేకూరి సాయిబాబా శ్రీనివాసరాజు (సాయి), కుమార్తె చిలివిటర్ల అన్నపూర్ణ ఉన్నారు. సూరిబాబు పదేళ్లపాటు కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా పని చేశారు. ఆయన తండ్రి రామకృష్ణంరాజు మృతి పట్ల ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, జడ్పిటిసి సభ్యుడు ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, వైయస్సార్సీపి సీనియర్ నాయకులు డిటిడిసి బాబు, పాలకొల్లు న్యూ లైఫ్ డాక్టర్ వర్మ తదితరులు సూరిబాబును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ మంత్రి, వైఎస్ఆర్సిపి ఆచంట నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు, ఎంపీపీ సుమంగళి, పోదూరు మాజీ సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణ రాజు, వై ఎస్ ఆర్ సి పి మండల అధ్యక్షుడు పిల్లి నాగన్న, నాయకులు అధికారులు సూరిబాబు తండ్రి రామకృష్ణారాజు మృతి పట్ల సంతాపం తెలిపారు.

## గణపతి వేడుకల్లో చిన్నారుల సాంస్కృతిక సందడి

గోల్డ్ మార్కెట్లో అవగాహన కల్పించిన ఎస్బిఐలైఫ్



**ప్రజా జ్యోతి (పాలకొల్లు), సెప్టెంబర్ 20 :** గణపతి చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం పాలకొల్లు పట్టణంలో గోల్డ్ మార్కెట్ వద్ద చిన్నారులకు సాంస్కృతిక పోటీలు ఘనంగా నిర్వహించారు. గోల్డ్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఏజెన్సీ మేనేజర్ టి. శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు ఉత్సాహంగా సాంస్కృతిక పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ ఏజెన్సీ మేనేజర్ టి. శేఖర్, లైఫ్ మిత్ర కె.ఎస్.ఎస్.కె. గుప్తా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక ప్రణాళికతో కుటుంబ భద్రతను కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. ప్రత్యేకంగా పిల్లల భవిష్యత్తుకు మంచి ఆర్థిక ప్రణాళిక కలిగి ఉండటం తల్లిదండ్రుల బాధ్యత అని వారు తెలిపారు. పిల్లల విద్య, అభివృద్ధి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పొదుపు, ఆర్థిక ప్రణాళికపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు కమిటీ పెద్దలు బహుమతులు అందజేశారు. విజేతలను అభినందించి, పిల్లలు మరింత ఉత్సాహంతో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గోల్డ్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు శేర్ తుకారం, ఉపాధ్యక్షులు కాదా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వింజరపు విజయ్, కార్యదర్శి కంది శ్రీనివాస్, కోశాధికారి కలిశెట్టి మోహన్, ఆలయ చైర్మన్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## 108 రకాల స్వీట్లు, 108 ప్రసాదాలతో గణనాథుడికి ఘన నైవేద్యం

**మంచిర్యాల,** మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్ సృష్టి ఎంక్లేవ్ అపార్ట్‌మెం ట్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వివిధ రకాల ముగ్గులతో ఆలయ ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. అనంతరం 108 రకాల స్వీట్లు, 108 రకాల ప్రసాదాలతో స్వామివారికి నైవేద్యాలు సమర్పించి అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ కాలనీవాసులు భక్తిశ్రద్ధల తో గణనాథుడిని పూజించి, ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో పేరం రాజయ్య--జోత్స్న దంపతులు, న్యాయవాది అలేఖ్య నటేశ్వర్, ఎథిక్ అకాడమీ యాజమాన్యం, పల్లవి మోడల్ స్కూల్ యాజమాన్యం, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, సతీష్‌రావు, చౌదరి, రాజగోపాల్‌తో పాటు మహిళలు, చిన్నారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# స్లేట్ పాఠశాలలో ముగిసిన మోడల్ యునైటెడ్ నేషన్ 3.0

## విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడమే స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లక్ష్యం

**జన్నారం :** స్లేట్ హైస్కూల్ మరియు స్లేట్ సీబీఎస్ఈ పాఠశాలల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సెన్స్ పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన మోడల్ యునైటెడ్ నేషన్ కార్యక్రమం ఆదివారం తో ఘనంగా ముగిసింది. సెప్టెంబర్ 18 నుంచి 20 వరకు స్టేట్ ఎక్సలెన్స్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ సదస్సులో 20 పాఠశాలల నుంచి విద్యార్థి ప్రతినిధులు దేశాల అనుకరణలు, సంక్షోభ పరిస్థితులపై కార్యక్రమాలు, పార్లమెంటరీ చర్చల్లో పాల్గొన్నారు. మొదటి రోజు కార్యక్రమాన్ని ముఖ్య అతిథి నవోదయ విద్యాలయ సమితి, రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ ఎ. యుగంధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే ప్రతినిధులుగా పలు జాతీయ, అంతర్జాతీయ విషయాలను అవగాహన చేసుకుని వాటిపై చర్చించారు. విద్యార్థి ప్రతినిధులు దౌత్య అనుకరణలు సంక్షోభ ప్రతిస్పందన కార్యక్రమాలు, పార్లమెంటరీ చర్చల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు ప్రధాన అంశాలను తీసుకున్నారు. లోక్ సభలో స్పీకర్ గా ఎ.సుప్రీత్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ గా ఎండి రయ్యాన్ వ్యవహరించారు. మొదటి రోజు వికసిత్ భారత్ పై చర్చ జరగగా ఈ చర్చలో నిర్మలా సీతారామన్, రాహుల్ గాంధీ, శశి థరూర్, నితిన్ గడ్కరీ, జైశంకర్ తదితర ఎంపీలను తలపించే విధంగా విద్యార్థులే ప్రతినిధులుగా వ్యవహరించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చైర్ గా రాగుల అవినాష్, కో-చైర్ గా సాయి హర్షితలు వ్యవహరించి డ్రోన్ యుద్ధం మరియు రక్షణ సాంకేతికతపై ఆస్ట్రేలియా,ఇరాన్, ఇజ్రాయెల్, భారత్, స్విట్జర్లాండ్,యూకే, ఫ్రాన్స్ దేశాల ప్రతినిధులు చర్చించారు రెండవ రోజు భారత్-పాకిస్తాన్ సరిహద్దు సంక్షోభ ప్రతిస్పందన కార్యక్ర మం నిర్వహించారు. రెండవ రోజు స్పైన్ భద్రత అంశంపై ఫ్రాన్స్ మరియు ఆస్ట్రేలియా ప్రతినిధుల మధ్య తీవ్ర వాదోపవాదం జరిగింది. యునెస్కోలో చైర్ గా మునజ్జా మరియం, కో-చైర్ గా టీ. సహస్రలు వ్యవహరించి వాతావరణ పరిరక్షణలో కృత్రిమ మేధస్సు వినియోగాన్ని పరిశీలించారు. రష్యా, స్వీడన్, డెన్మార్క్, స్పెయిన్, మెక్సికో, ఉత్తర కొరియా, జపాన్, అమెరికా ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ పాత్రలలో లీనమై కళ్ళకు కట్టినట్లుగా వారి వారి పాత్రల వ్యవహార శైలిని ప్రదర్శించారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులలో జాతీయ అంతర్జాతీయ అంశాలపై అవగాహన కల్పించినందుకు యజమాన్యానికి స్లేట్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మూడు రోజుల



కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ ప్రెస్ కమిటీ చైర్ సిజి ప్రశాంత్ డాక్యుమెంట్ చేసింది. ఈ కమిటీలో ఆర్. శర్మ,పి. ఎస్. సపుత,సాయి వెన్నెల, ఎస్. తోషిణి,ఎం. ప్రణవి సభ్యులుగా ఉన్నారు. ముగింపు కార్యక్రమంలో స్లేట్ గ్రూప్ ఛైర్మన్ డా. ఎ. శ్రీకాంత్ రెడ్డి, ఎం. జి. భాస్కర్ రెడ్డి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతినిధులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్లీప్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకుడు సుభాష్ రెడ్డి, స్లేట్ ఎక్సెన్స్ స్కూల్ ప్రిన్సిపల్ షిరీన్ ఖాన్ ,స్లేట్ హై స్కూల్ ప్రిన్సిపల్ ప్రియా శివ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని యూనియన్లను అధికారిక సమావేశాలకు ఆహ్వానించాలి

### సేఫ్టీ సమావేశాల్లో పారదర్శకత పాటించాలి.. కార్మిక సమస్యలను పరిష్కరించాలి

### సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి

**మంచిర్యాల :** సింగరేణి యాజ మాన్యం నిర్వహించే మైన్ స్థాయి, ఏరియా స్థాయి, కంపెనీ స్థాయి అధికారిక సమావేశాలకు గుర్తింపు పొందిన, ప్రాతినిధ్య సంఘాలతో సంబంధం లేకుండా అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించి వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ లేబర్ కమిషనర్ నిర్వహించిన ఎన్నికలకు నిర్దేశించిన రెండేళ్ల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో యాజమాన్యం ఇకపై అన్ని యూనియన్లను సమానంగా పరిగణించి అధికారిక సమావేశాలకు ఆహ్వానించాలని అన్నారు. కార్మికుల సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ముఖ్యంగా డీజీఎంఎస్ అధికారులతో యాజమాన్యం నిర్వహించే సమావేశాలతో పాటు ఏరియా స్థాయిలో జరిగే బైపార్టీయేట్, ట్రైపార్టీయేట్ సమావేశాలకు అన్ని యూనియన్ల ప్రతినిధులను ఆహ్వానించాలని కోరారు. గుర్తింపు పొందిన లేదా ప్రాతినిధ్య సంఘాలకే పరిమితం కాకుండా ప్రతి కార్మిక సంఘానికి సమావేశాల్లో తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని యూనియన్లను సమావేశాలకు ఆహ్వానించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే అన్ని యూనియన్లు ఐక్యంగా సమావేశాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. డీజీఎంఎస్ అధికారులతో నిర్వహించే



సమావేశాల్లో సింగరేణి సంస్థలో జరిగిన ప్రమాదాలకు సంబంధించిన పూర్తి వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. ప్రమాదాల నివేదికలు, ప్రమాదాలకు దారితీసిన కారణాలు, యంత్రాల సామర్థ్యం, పని ప్రదేశాల్లో భద్రతా పరిస్థితులు తదితర అంశాలను వాస్తవ రూపంలో అధికారులకు తెలియజేయాలని అన్నారు. ప్రమాదాలకు సంబంధించిన కీలక వివరాలను కప్పిపుచ్చ కుండా వాస్తవాలను వెల్లడించాలని సూచించారు. యాజమాన్యం తనకు అనుకూలంగా ఉన్న సంఘాన్ని దగ్గర పెట్టుకుని సేఫ్టీ బైపార్టీయేట్, ట్రైపార్టీయేట్ సమావేశాలు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలు పూర్తిస్థాయిలో చర్చకు రావడం లేదని రాజారెడ్డి అన్నారు. పని ప్రదేశాల్లో అవసరమైన పనిముట్ల కొరత, రక్షణ పరికరాల కొరత వంటి సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నా యాజ మాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పని ప్రదేశాల్లో అవసరమైన రక్షణ పరికరాలు, పనిముట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ సింగరేణి సంస్థ లాభాలను ఇప్పటివరకు ప్రకటించకపోవడం సరికాదని అన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితి, లాభాల వివరాలను కార్మికులకు తెలియజేస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని, వెంటనే సంస్థ లాభాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. మరోవైపు కార్మికుల సీఎంపీఎఫ్ ఖాతాలకు సంబంధించిన వివరాలను సకాలంలో అప్‌డేట్ చేయకపోవడం వల్ల కార్మికులు తమ సీఎంపీఎఫ్ వివరాల విషయంలో గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. ప్రతి కార్మికుడి సీఎంపీఎఫ్ ఖాతా వివరాలను సక్రమంగా అప్‌డేట్ చేసి, వారికి తమ ఖాతాలకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్మికుల భద్రత, సంక్షేమం, సీఎంపీఎఫ్, సంస్థ ఆర్థిక పరిస్థితి తదితర అంశాల్లో యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిం చాలని తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. అన్ని యూనియన్లతో సమన్వయంతో వ్యవహరిస్తూ కార్మికుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్, శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్ రామగిరి రామస్వామి, కస్తూరి చంద్రశేఖర్, తోడే సుధాకర్, బోడకుంట శంకర్, వెంకట్ రెడ్డి, మెల్లం శ్రీధర్, మీడివెల్లి శ్రీనివాస్, సాయిళ్ల శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్, వెంగల శ్రీనివాస్, సమ్మయ్య, అనిల్, భానేష్ తదితరులు పాల్గొన్నారు.

# 24నే నిమజ్జనం

**హైదరాబాద్ :** గణేశోత్సవం ప్రారంభం కాగానే వినాయక నిమజ్జనం ఎప్పుడు చేస్తారు అనేది సర్వసాధారణంగా అడిగే ప్రశ్నలలో ఒకటి. కొందరు గణపతిని ఒకటిన్నర రోజులోపే నిమజ్జనం చేస్తే, మరికొందరు మూడవ, ఐదవ లేదా ఏడవ రోజు చేస్తారు. అయితే నవరాత్రులు పూజలందిస్తే తుదివీడ్కోలు అనంత చతుర్దశి రోజున జరుగుతుంది. 2026లో అనంత చతుర్దశి తేదీ సెప్టెంబర్ 24 , 25 తేదీ ఎప్పుడొచ్చింది? ఎందుకంటే సెప్టెంబర్ 24న చతుర్దశి ఆలస్యంగా ప్రారంభమవుతుంది. క్యాలెండర్ ప్రకారం, గణేష్ నిమజ్జనానికి ప్రధాన తేదీ 2026 సెప్టెంబర్ 25 శుక్రవారంతెలుగు పంచాంగం ప్రకారం భాద్రపద మాసం శుక్ల పక్ష చతుర్దశి సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి 09:53 గంటలకు ప్రారంభమై, సెప్టెంబర్ 25వ తేదీ రాత్రి సుమారు 10:10 గంటలకు ముగుస్తుంది. సెప్టెంబర్ 24వ తేదీ సూర్యోదయం సమయానికి త్రయోదశి ఉంటుంది..సెప్టెంబర్ 25వ తేదీన చతుర్దశి తిథి సూర్యోదయం, సూర్యాస్తమయానికి ఉంటుంది. అందుకే ఉదయించే తేదీని బట్టి అనంత చతుర్దశి వ్రతం, విష్ణు పూజ , పదవ రోజున చేసే గణేష్ నిమజ్జనం చేస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 25 తేదీన గణేష్ నిమజ్జనం. వివిధ నగరాల్లో సూర్యోదయం మరియు స్థానిక క్యాలెండర్ల కారణంగా, తేదీ ముగిసే సమయం ఒకటి లేదా రెండు నిమిషాలు మారవచ్చు. అయినప్పటికీ, పండుగ తేదీ మాత్రం సెప్టెంబర్ 25న మారదు.

గణేష్ నిమజ్జనానికి 2026కి శుభ సమయం

ఉదయం శుభ సమయం: ఉదయం 6:11 నుంచి 10:42 వరకు.

మధ్యాహ్నానికి శుభ సమయం: 12:13 జూఎ నుంచి 1:43 జూఎ వరకు.

సాయంకాల ముహూర్తం: సాయంత్రం 4:44 నుంచి 6:14 వరకు.

రాత్రి సమయం: రాత్రి 9:14 నుంచి 10:43 వరకు.

వీటిలో కుటుంబాలకు అత్యంత అనుకూలమైన సమయం ఉదయం 6:11 నుంచి 10:42 వరకు. బహిరంగ పండాల్‌ల వద్ద నిమజ్జన ఊరేగింపు సుదీర్ఘంగా ఉండటం వల్ల, సాయంత్రం



లేదా రాత్రి సమయాన్ని కూడా ఎంచుకుంటారు. ముంబై, పూణే, నాగ్‌పూర్ లేదా ఇతర నగరాల్లోని చౌఘడియా సమయాలు కొన్ని నిమిషాల తేడాతో మారవచ్చు. అందువల్ల, స్థానిక పరిపాలన యంత్రాంగం నిర్దేశించిన సూర్యోదయం , నిమజ్జన సమయాలను పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం. నిమజ్జనానికి ముందు సాధారణ గణేశ పూజ చేయండి. బప్పాకు దూర్వా , ఎర్రని పువ్వులు, మోదకాలు లేదా ఇంట్లో తయారుచేసిన ప్రసాదాన్ని సమర్పించండి. అనంతరం, కుటుంబ సభ్యులందరూ కలిసి హారతి ఇవ్వండి. పూజ సమయంలో చేసిన ఏవైనా తప్పులకు క్షమాపణ కోరి, వచ్చే ఏడాది ఆయన తిరిగి రావాలని ప్రార్థించండి.

బిజినెస్

## చంద్రశేఖరన్ నియామకం చెల్లుబాటు కాదు: టాటా ట్రస్ట్స్




దిల్లీ: టాటా గ్రూపులో ముసలం రోజురోజుకూ తీవ్రమవుతోంది. టాటా సన్స్ (ఘ్ఘుంశీఅం) బోర్డు సమావేశంలో ఎన్. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్ల కాలానికి ఛైర్మన్‌గా పునర్నియమిస్తూ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని, అది చెల్లుబాటు కాదని టాటా ట్రస్ట్స్ వాదిస్తోంది. ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ ప్రకారం ట్రస్ట్-నామినేటెడ్ డైరెక్టర్ల మెజారిటీ సమ్మతి అవసరం అని పేర్కొంది.

సెప్టెంబర్ 17న జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో బోర్డు డైరెక్టర్లు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని ఆమోదించారు. అయితే, బోర్డులో అతిపెద్ద వాటాదారు అయిన టాటా ట్రస్ట్స్ ఈ పునర్నియామకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. టాటా సన్స్‌లో సుమారు మూడింట రెండు వంతుల వాటా కలిగిన టాటా ట్రస్టులకు ఛైర్మన్‌గా ఉన్న నోయల్ టాటా.. చంద్రశేఖరన్ పదవీకాలం పొడిగింపునకు వ్యతిరేకంగా ఓటు వేశారు. బోర్డులోని టాటా ట్రస్టుల నామినీ అయిన వేణు శ్రీనివాసన్ మాత్రం చంద్రశేఖరన్ పదవీకాలం పొడిగింపునకు మద్దతు తెలిపారు.

బోర్డు సమావేశంలో ఎలాంటి ప్రతిష్టంభన లేదని టాటా ట్రస్ట్స్ పేర్కొంది. ట్రస్ట్స్ నామినేట్ చేసిన ఇద్దరు డైరెక్టర్లలో ఒకరు వ్యతిరేకంగా ఓటు వేశారు కాబట్టి తీర్మానం చట్టబద్ధంగా ఆమోదం పొందలేదని ఓ ప్రకటనలో పేర్కొంది. "టాటా సన్స్ బోర్డులో ఇద్దరు టాటా ట్రస్ట్స్ నామినీలు ఉన్నారు. ఇద్దరిలో మెజారిటీ అంటే ఇద్దరు. ఒకరు కాదు. సెప్టెంబర్ 17న ఒక డైరెక్టర్ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. అందువల్ల ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ ప్రకారం టాటా ట్రస్టుల నామినీ డైరెక్టర్ల అనుకూల మద్దతు లభించలేదు. కాబట్టి తీర్మానం పూర్తిగా ఆమోదం పొందలేదు" అని టాటా ట్రస్ట్స్ పేర్కొంది. టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కు 66 శాతం వాటా ఉంది.

బోర్డు గణనతో సంబంధం లేదని, ఆర్టికల్స్ ట్రస్ట్-నామినేటెడ్ డైరెక్టర్లకు ప్రత్యేక అధికారాలు ఉంటాయని టాటా ట్రస్ట్స్ చెబుతోంది. "ఓటు ఫలితం 4:1గా ఉన్నా లేదా ఇంకో సంఖ్య ఉన్నా సంబంధం లేదు. ఒక నిబంధనకు లోబడి తీర్మానం జరిగిందా? లేదా అనేది ముఖ్యం. తాజా ఉదంతంలో అలా జరగలేదు" అని ట్రస్ట్స్ పేర్కొంది. కాస్టింగ్ ఓటు వాదననూ టాటా ట్రస్ట్స్ తిరస్కరించింది. మొత్తం బోర్డు స్థాయిలో ఓట్లు సమానంగా వచ్చినప్పుడు మాత్రమే ఛైర్మన్ స్థానంలో నోయల్ టాటా కాస్టింగ్ ఓటు వాడుకలోకి వస్తుందని స్పష్టం చేసింది. మాజీ ఛైర్మన్ సైరస్ మిస్త్రీ తొలగింపునకు సంబంధించిన వ్యాజ్యం సందర్భంగా టాటా సన్స్ ఇవే నిబంధనలను సమర్థించుకున్న విషయాన్ని ప్రస్తావించిందని టాటా ట్రస్ట్స్ గుర్తుచేసింది.

# ఈపీఎఫ్ వేతన పరిమితి పెరిగింది.. మరి బీమా మాటేంటి..?

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) వేతన గరిష్ఠ పరిమితి నెలకు రూ.15,000 (బేసిక్ పే, డియర్‌నెస్ అలవెన్స్-డీఏ కలిపి) నుంచి రూ.25,000కు పెరిగిన విషయం తెలిసిందే. అయితే ఇందుకు తగ్గట్టుగా ఈపీఎఫ్ సబ్‌స్క్రైబర్లకు ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్ఐ) స్కీం కింద అందే జీవిత బీమా ప్రయోజనాన్ని మాత్రం కేంద్రం పెంచలేదు. దీంతో ఉద్యోగ భవిష్య నిధి ఖాతాదారులు రూ.3.5 లక్షలదాకా బీమా కవరేజీని నష్టపోవాల్సి వస్తున్నది.




**ఈడీఎల్ఐ అంటే?**

ఈపీఎఫ్‌లో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికీ అందే ఉచిత జీవిత బీమా సౌకర్యమే ఈడీఎల్ఐ. సర్వీస్‌లో ఉండగా మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు/నామినీలకు ఈ బీమా సొమ్ము అందుతుంది. ఈ బీమాకు ఉద్యోగి పనిచేస్తున్న సంస్థనే నెలనెలా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుంది. మొన్నటిదాకా ఇది గరిష్ఠంగా రూ.75 (నెలవారీ బేసిక్ పే, డీఏలో 0.5 శాతం)గా ఉన్నది. ఇప్పుడు రూ.125కు పెరిగింది. ఇటీవల ఈపీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి రూ.15,000 నుంచి రూ.25,000కు పెరుగడమే కారణం. అయినప్పటికీ మోదీ సర్కార్ మాత్రం ఈడీఎల్ఐ కవరేజీ పెంపు ఊసే ఎత్తడం లేదు.

ఇదీ సంగతి..

ప్రస్తుతం ఈడీఎల్ఐ ప్లాన్ కింద ఉద్యోగికి కనీస ఇన్సూరెన్స్ కవరేజీ రూ.2.5 లక్షలుగా, గరిష్ఠ బీమా రూ.7 లక్షలుగా ఉన్నది. ఉద్యోగి జీతం, ఈపీఎఫ్ బ్యాలెన్స్‌లపై ఇది ఆధారపడి ఉంటుంది. నిజానికి 2014కు ముందు ఈపీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి నెలకు రూ.6,500గానే ఉండేది. అప్పుడు ఈడీఎల్ఐ స్కీం ద్వారా బీమా ప్రయోజనం కూడా రూ.1.55 లక్షలే. 2014 సెప్టెంబర్‌లో వేతన గరిష్ఠ పరిమితి రూ.15,000కు పెరిగింది. అప్పుడే బీమాను కూడా రూ.6 లక్షలకు ప్రభుత్వం ప్రత్యేకంగా పెంచింది.

ఇక 2021 ఏప్రిల్‌లో బీమాను మాత్రమే సెపరేట్ నోటిఫికేషన్ ద్వారా రూ.7 లక్షలకు పెంచారు. అయితే ఇప్పటికీ అది అలాగే ఉన్నది. దీంతో ఇప్పుడు వేతన గరిష్ఠ పరిమితి రూ.10,000 పెరిగినందున, ఆ మేరకు బీమా ప్రయోజనాన్నీ పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ఒకవేళ పెంచితే గరిష్ఠ బీమా రూ.10.50 లక్షలకు చేరే వీలున్నది. లేకపోతే రూ.7 లక్షలకే పరిమితమై.. ఉద్యోగుల కుటుంబాలు రూ.3.50 లక్షలు కోల్పోవాల్సి వస్తుంది.

పొదుపునకు మద్దతివ్వాలి

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ అనేది ఉద్యోగుల సంక్షేమం గురించేనని, ఇందులో ప్రయోజనాలు శ్రామికుల పొదుపునకు దోహదం చేస్తాయని పలువురు ఆర్థిక నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం దృష్ట్యా ఈడీఎల్ఐ బీమా కవరేజీని కూడా పెంచాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలకు వారు సూచిస్తున్నారు. ఉద్యోగి మరణం తర్వాత వారి కుటుంబ సభ్యులకు అందే ఈ పరిహారం విషయంలో మోదీ సర్కార్ లెక్కలు వేయడం సరికాదని, వెంటనే ఈపీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితికి తగ్గట్టుగా ఈడీఎల్ఐ బీమా ప్రయోజనాన్నీ పెంచేలా ఓ నోటిఫికేషన్ విడుదల చేయాలని అంటున్నారు.

ఈడీఎల్ఐ బీమా లెక్కింపు ఇలా..

**రూ.15,000 (బేసిక్ పే, డీఏ)35=రూ.5.25 లక్షలు**

రూ.5.25 లక్షలుంరూ.1.75 లక్షలు (ఉద్యోగి పీఎఫ్ బ్యాలెన్స్ సగటు (గరిష్ఠంగా 3.5 లక్షలు)లో 50 శాతం లేదా గరిష్ఠంగా రూ.1.75 లక్షలు)=రూ.7 లక్షలు

నోట్: బీమా ప్రయోజనం అందే సమయంలో ఉద్యోగి పీఎఫ్ బ్యాలెన్స్ సగటు తక్కువగా ఉంటే అందులో 50 శాతాన్నే పరిగణనలోకి తీసుకుని చెల్లింపులుంటాయి. ఇల్లు, చదువు, ఆరోగ్య సమస్యలు తదితర అవసరాల నిమిత్తం చాలామంది తమ పీఎఫ్ సొమ్ము నుంచి పాక్షిక ఉపసంహరణలు చేసుకుంటున్నది చూస్తూనే ఉన్నాం. అలాగే బేసిక్ పే, డీఏ (డీఏ లేకపోతే బేసిక్ పే ఆధారంగానే) ఉద్యోగులందరికీ ఒకేలా ఉండవు. కనుక బీమా ప్రయోజనం కనిష్ఠంగా రూ.2.5 లక్షలు, గరిష్ఠంగా రూ.7 లక్షల మధ్య ఎంతైనా రావచ్చు.

పెరిగిన వేతన పరిమితి ప్రకారం ఈడీఎల్ఐ ప్రయోజనాన్ని పెంచితే..

రూ.25,000(బేసిక్ పే, డీఏ)35=రూ.8.75 లక్షలు

రూ.8.75 లక్షలుంరూ.1.75 లక్షలు=రూ.10.5 లక్షలు

## ఈ వారం ఐపీఓలు: 6 పబ్లిక్ ఇష్యూలు.. రూ.3,825 కోట్లు

ఇంటర్నెట్ డెస్క్: ఈ వారం కూడా దలాల్ స్ట్రీట్‌లో పబ్లిక్ ఇష్యూ సందడి కొనసాగనుంది (బజూఎశీఎఱఅస్త్ర ఞూాం). ఆరు కంపెనీలు దాదాపు రూ.3,825 కోట్లు నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 22 నుంచి సెప్టెంబర్ 28 మధ్య ఐపీఓకు వస్తున్నాయి. ఎలివేట్ క్యాంపసెస్, వర్మోరా గ్రానిటో వంటి కంపెనీలు ఇందులో ఉన్నాయి. ఐపీఓ నిధులను మూలధన వ్యయం, వ్యాపార విస్తరణ, రుణాల చెల్లింపులు వంటి అవసరాల కోసం ఆయా కంపెనీలు వినియోగించనున్నాయి. గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్ తేదీ ప్రకటించిన అమెజాన్

**ఆరు ఐపీఓలు ఇవే..**

హిల్‌హౌస్ ఇన్వెస్ట్‌మెంట్ మద్దతు ఉన్న ఎలివేట్ క్యాంపసెస్ ఈ వారంలో వచ్చే అతిపెద్ద ఐపీఓ. రూ.2,100 కోట్ల నిధులను సమీకరించనుంది. సెప్టెంబర్ 23న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. సెప్టెంబర్ 25న ముగియనుంది. ధరల శ్రేణి రూ.343 -362గా కంపెనీ నిర్ణయించింది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయించనున్నారు.

టైల్స్, బాత్‌వేర్ తయారీ కంపెనీ వర్మోరా గ్రానిటీ రూ.708 కోట్ల నిధులను ఐపీఓ ద్వారా సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.140-148గా కంపెనీ నిర్ణయించింది. సెప్టెంబర్ 22న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. సెప్టెంబర్ 24న ముగియనుంది. ఇంటిగ్రెటేడ్ స్టీల్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ ఏ-వన్ స్టీల్స్ ఇండియా లిమిటెడ్ రూ.405 కోట్ల నిధులను సమీకరించేందుకు ఐపీఓకు వస్తోంది. ధరల శ్రేణి రూ.385-405గా నిర్ణయించింది. సెప్టెంబర్ 24న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. సెప్టెంబర్ 28న ముగియనుంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ఇంటిగ్రెటేడ్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన ఆర్మీ ఇన్ఫోటెక్ రూ.300 కోట్ల నిధుల సమీకరణతో ఐపీఓకు వస్తోంది. సెప్టెంబర్ 23-25 మధ్య సబ్‌స్క్రిప్షన్ ఉంది. ఒక్కో షేరు ధర రూ.350-375గా కంపెనీ నిర్ణయించింది. కంపెనీ తాజా షేర్లను మాత్రమే విక్రయించనుంది. ఈపీసీ సొల్యూషన్ ప్రొవైడర్ కంపెనీ స్వస్తిక ఇన్‌ఫ్రా రూ.161 కోట్లు నిధుల సమీకరణతో ఐపీఓకు వస్తుంది. ధరల శ్రేణి రూ. 175-185గా కంపెనీ నిర్ణయించింది. సెప్టెంబర్ 23-25 మధ్య సబ్‌స్క్రిప్షన్ ఉంది. అడ్రాయిట్ ఇండస్ట్రీస్ (ఇండియా) రూ.151 కోట్ల నిధుల సమీకరణతో సెప్టెంబర్ 23న ఐపీఓకు వస్తుంది. ధరల శ్రేణి రూ.126- 134గా కంపెనీ నిర్ణయించింది.

సెప్టెంబర్ 23న హీరో మోటార్స్, ఎస్ఎస్ రిటైల్స్, జిందాల్ సుప్రీం కంపెనీల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ కానున్నాయి. సెప్టెంబరు 24 ఎన్ఎస్ఈ కంపెనీ షేర్లు బీఎస్ఈలో లిస్టింగ్‌కు రానున్నాయి.

# టీమిండియా క్రికెటర్ సంచలన నిర్ణయం.. 18 ఏళ్ల తర్వాత వేరే జట్టుకు?

రంజీ ట్రోఫీ 2026-27 సీజన్ ప్రారంభానికి ముందు భారత సీనియర్ ఫాస్ట్ బౌలర్ ఉమేష్ యాదవ్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. తన సొంత జట్టు అయిన విదర్భతో 18 ఏళ్ల అనుబంధానికి వీడ్కోలు పలికాడు. రాబోయే దేశవాళీ సీజన్‌లో కొత్త జట్టు తరఫున బరిలోకి దిగేందుకు విదర్భ క్రికెట్ అసోసియేషన్ నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' తీసుకున్నాడు. ఈ విషయాన్ని ఉమేష్ స్వయంగా ధ్రువీకరించాడు. "ఈ సీజన్ నుంచి మరొక రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని నిర్ణయించుకున్నాను. దీనికి సంబంధించి విదర్భ క్రికెట్ అసోసియేషన్ నుంచి ఎన్ఓసీ కూడా లభించింది" అని ఉమేశ్ పేర్కొన్నాడు. అయితే తానూ ఏ జట్టు తరఫున ఆడబోతున్నాడనే విషయాన్ని ఉమేష్ ఇంకా వెల్లడించలేదు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రకారం.. ఉమేష్ ఇప్పటికే కొన్ని రాష్ట్రాల క్రికెట్ బోర్డులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.




**18 ఏళ్ల ప్రయాణానికి ముగింపు**

2008-09 సీజన్‌లో విదర్భ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఉమేష్.. రెడ్ బాల్ క్రికెట్‌తో పాటు వైట్ బాల్ ఫార్మాట్‌లోనూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే భవిష్యత్తులో జట్టులో తన పాత్ర ఏమిటనే దానిపై విదర్భ సెలెక్టర్లు స్పష్టత ఇవ్వకపోవడమే అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అతడు చివరగా విదర్భ తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025-26లో ఆడాడు. ఈ టోర్నీల్లో 4 మ్యాచ్‌లు ఆడి 4 వికెట్లు పడగొట్టాడు. రంజీ ట్రోఫీలో మాత్రం ఆఖరిసారిగా అక్టోబర్ 2024లో నాగ్‌పూర్‌లో ఆంధ్రతో జరిగిన మ్యాచ్‌లోనే ఆడాడు. ఆ తర్వాత అతడు రెడ్‌బాల్ క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు.

## షెఫాలీ శతక మోత ఫైనల్లో టీమిండియా

నిషిన్ : డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళా క్రికెట్ జట్టు ఆసియాడ్‌లో మరోసారి పసిడి పోరుకు సిద్ధమైంది. ఆదివారం ఏకపక్షంగా సాగిన రెండో సెమీ ఫైనల్స్‌లో షెఫాలీ వర్మ (49 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్స్‌లతో 100 నాటౌట్) అజేయ శతక గర్జన చేయగా టీమిండియా 114 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. షెఫాలీకి తోడు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (40), స్మృతి మంధాన (37) ధనాధన్ ఆటతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లకు 4 వికెట్ల నష్టపోయి 195 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్యఛేదనలో బంగ్లా 15.4 ఓవర్లకు 81 రన్స్‌కే కుప్పకూలింది. ఓపెనర్ దిలారా అక్తర్ (27) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో దీప్తి శర్మ (3/7), శ్రీచరణి (2/7) స్పిన్ మాయకు తోడు నందని శర్మ (3/25) తన పేస్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను క్రీజులో నిలువనీయలేదు. మరో సెమీస్‌లో శ్రీలంక.. పాకిస్థాన్‌ను ఓడించి ఫైనల్ చేరింది. మంగళ వారం ఇదే వేదికలో భారత్, శ్రీలంక ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. 1 టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా మంధాన (4,788) సుజీ బేట్స్ (4,758) ను అధిగమించి ఈ ఫార్మాట్‌లో టాప్ రన్ స్కోరర్‌గా నిలిచింది.




స్పోర్ట్స్

## ఆస్ట్రేలియాను వణికించిన జింబాబ్వే.. ఒక్క వికెట్ తేడాతో




హరారే వేదికగా జింబాబ్వే-ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడో వన్డే అభిమానులను ఆఖరి వరకు మునివేళ్లపై నిలబెట్టింది. చివరి వరకు నువ్వా-నేనా అన్నట్లు సాగిన ఈ ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఆస్ట్రేలియా విజయం సాధించింది. 272 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కంగారూలకు జింబాబ్వే బౌలర్లు చుక్కలు చూపించారు. జోష్ ఇంగ్లిస్ (103) సెంచరీతో కదం తొక్కినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో ఆసీస్ కష్టాల్లో పడింది. ఒకానొక దశలో 232 పరుగులకే 8 వికెట్లు కోల్పోవడంతో ఆసీస్‌కు ఓటమి తప్పదని అంతా భావించారు. ఈ సమయంలో 9వ స్థానంలో క్రీజులోకి వచ్చిన పేసర్ నాథన్ ఎల్లిస్ (36 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. చివరి ఓవర్‌లో ఆసీస్ విజయానికి 9 పరుగులు అవసరం కాగా.. ఎల్లిస్ తొలి బంతికే సిక్స్ బాది విజయాన్ని ఖాయం చేశాడు. కాగా 49వ ఓవర్‌లో ఎల్లిస్ ఇచ్చిన క్యాచ్‌ను మధెవెరే జారవిడవడమే జింబాబ్వే ఓటమికి కారణమైంది. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ 4 వికెట్లతో రాణించాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసింది. కెప్టెన్ సికందర్ రాజా (81 నాటౌట్), క్రైగ్ ఎర్విన్ (59), ఇన్నోసెంట్ కైయా (55) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎల్లిస్ 3, ఆడమ్ జంపా, స్పెన్సర్ జాన్సన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది.



# 'కదిరి కాళిదాస్'.. 'కాకా' నుంచి మెగాస్టార్ క్రేజీ అప్‌డేట్!

మెగాస్టార్ చిరంజీవి మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా ఈ చిత్రంలో తన పాత్రకు సంబంధించి లీక్స్ ఇచ్చాడు చిరంజీవి. ఇటీవల జరిగిన ఓ సినిమా వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెగాస్టార్ చిరంజీవి, స్టేజ్ పై సరదాగా మాట్లాడుతూ తన పాత్రకు సంబంధించి కొన్ని ఆసక్తికర హింట్స్ ఇచ్చారు. ఈ చిత్రంలో ఆయన 'కదిరి కాళిదాస్' అలియాస్ 'సత్యం' అనే విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. పైకి సాధారణ ప్రజలకోసం ఓ ఆక్వా ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేసే సాధారణ వ్యక్తిలా సత్యం కనిపిస్తారని, కానీ తెరవెనుక అండర్‌వాల్డ్‌ను శాసించే శక్తిగా 'కదిరి కాళిదాస్' రూపంలో ఆయన అసలు నిజస్వరూపం బట్టబయలవుతుందని సమాచారం.వీశీజఱవం ఈ చిత్రంలో తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే బలమైన భావోద్వేగాలు కథకు ప్రధాన ఆత్మగా నిలవనున్నాయి. మలయాళీ నటి అనస్వర రాజన్ చిరంజీవి కూతురు 'అమ్ములు' పాత్రలో నటిస్తుండగా, ఆమె మెడిసిన్ చదివే విద్యార్థినిగా కనిపించనుంది. వీరిద్దరి మధ్య నడిచే ఎమోషనల్ బాండింగ్ ప్రేక్షకులను కంటతడి పెట్టించడంతో పాటు సినిమాకే హైలైట్‌గా మారుతుందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అన్ని హంగులు పూర్తి చేసుకుని ఈ పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ పక్కా ప్రణాళికతో సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ కూడా రానుండటంతో మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# అడవి నేపథ్యంలో వైల్డ్ యాక్షన్‌తో సత్యదేవ్.. 'సమవర్తి' టీజర్ రిలీజ్

వర్సటైల్ ట్యాలెంటెడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న లేటెస్ట్ ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'సమవర్తి'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక టీజర్‌ను లాంచ్ చేశారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ టీజర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రకృతికి, మానవులకు మధ్య నడిచే సంఘర్షణ, అడవుల అక్రమ నరికివేత, గిరిజనుల జీవన విధానం వంటి సరికొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టీజర్ ఆరంభంలో వచ్చే వైవిధ్యమైన వాయిస్ ఓవర్ కథపై ఆసక్తిని కలిగిస్తుంది. ఇక ఈ చిత్రంలో 'మహాదేవ్' అనే వైల్డ్ అండ్ రగ్డ్ పాత్రలో సత్యదేవ్ కనిపించనున్నారు. ఆయన గెటప్, తెలంగాణ యాసలో చెప్పే పవర్‌ఫుల్ డైలాగులు, ముఖ్యంగా టీజర్ ముగింపులో వచ్చే "ఈసారి మిస్ అవ్వదు" అనే డైలాగ్ సినిమాపై హైప్‌ను తారాస్థాయికి చేర్చాయి.తెలంగాణ వార్తలు అడవులు, ప్రత్యేకమైన లొకేషన్లలో అత్యంత సహజసిద్ధంగా తెరకెక్కించిన విజువల్స్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. చివరిలో చూపించిన పులి ఎంట్రీ సీన్ మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఇందులో దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్ వంటి ప్రముఖ తారాగణం నటిస్తోంది. సింజిత్ యర్రమిల్లి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని రుద్ర పిక్చర్స్ మరియు పంచభూత ప్రొడక్షన్స్ సంస్థలు అత్యున్నత నిర్మాణ విలువలతో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.

# 'ఆయుధం ఏ యుద్ధానికి భయపడదు'.. రష్మిక యాక్షన్ టీజర్



టాలీవుడ్ హీరోయిన్ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో వస్తోన్న లేడీ ఓరియంటెడ్ మూవీ మైసా. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి రవీంద్ర పూలే దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్‌లో రష్మిక లుక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని అన్ ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'అలసిపోయాను.. ఆగిపోయాను.. ఓడిపోయాను' అనే రష్మిక డైలాగ్‌తో ఈ టీజర్ ప్రారంభమైంది. ఈ టీజర్ చూస్తుంటే తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే మహిళ పాత్రలో రష్మిక కనిపించనున్నట్లు తెలుస్తోంది. 'యుద్ధానికి ఆయుధమంటే భయం కానీ.. ఆయుధం ఏ యుద్ధానికి భయపడదు' అనే డైలాగ్ మైసాపై మరింత ఆసక్తి పెంచుతోంది. రష్మిక ఫైట్ సీన్స్ చూస్తుంటే ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ మూవీని నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి జేక్స్ బేజోయ్ సంగీతమందిస్తున్నారు.




# ఎమోషన్... థ్రిల్

దినేష్ తేజ్, దశ్విక .కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం. 'తత్వం'. అర్జున్ కోల దర్శకత్వంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటి నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా అర్జున్ కోల మాట్లాడుతూ -- "మన చుట్టూ జరుగుతున్న సంఘటనల ఆధారంగా ఈ కథను తయారు చేసుకున్నాను. వంశీగారి 'అన్వేషణ' సినిమా తరహాలో ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమా ఇది. ఈ చిత్రంలోని ఓ ట్విస్ట్ ప్రేక్షకులకు షాకింగ్‌గా ఉంటుంది" అని చెప్పారు. "మంచి ఎమోషనల్ థ్రిల్లర్ సినిమా ఇది" అన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: చేతన్ భరద్వాజ్.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,